Follow: @ANNTELUGU
22-10-2026
# మహా పత్రిక
ANN తెలుగు
గురువారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 267 పేజీలు-08 వెల-రూ.1
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## చెడుపై మంచి సాధించిన విజయమే దసరా

- సనాతన హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో దసరా వేడుకలు
- ముఖ్య అతిథులుగా హాజరైన కంది శ్రీనివాస రెడ్డి దంపతులు
- ఆధ్యాత్మిక స్పీచ్ తో ఆకట్టుకున్న కంది శ్రీనివాస రెడ్డి
- అవసరమయిన సమయాలలో అమ్మాయిలు కాళికామాతలుగా మారాలన్న కంది మౌనా శ్రీనివాస రెడ్డి
- శమీ చెట్టుకు పూజలు చేసిన కంది శ్రీనివాస రెడ్డి దంపతులు

06



టాప్ న్యూస్

## ఏపీలో 19 మున్సిపాలిటీల ఎన్నికల ప్రక్రియకు బ్రేక్

- అభ్యర్థుల తుది జాబితా ప్రచురణను నిలిపివేయాలని సుప్రీం ఉత్తర్వులు
- సుప్రీంకోర్టు సూచనలతో ఎస్ఈసీ కీలక నిర్ణయం



02

## ఈనెల 27 నుండి ఎంపీ ఈటల పాదయాత్ర

- జవహర్‌నగర్ డంప్ యార్డు తరలింపే టార్గెట్



02

## తొలి రోజే జియో ప్లాట్‌ఫామ్స్ ఐపీఓకు భారీ స్పందన

- 2.5 రెట్లు సబ్‌స్క్రిప్షన్
- మొత్తం ఇష్యూ విలువ రూ.30,213 కోట్లు




03



పోలీస్ శాఖలో

# 7,437 పోస్టుల భర్తీకి అనుమతి ఇచ్చాం

- సీఎం రేవంత్ రెడ్డి ప్రకటన
- శాంతి భద్రతలు బాగుంటేనే రాష్ట్రం అభివృద్ధి
- 2028 నాటికి పోలీస్ శాఖలో అన్ని ఖాళీలను భర్తీ చేస్తాం
- డ్రగ్స్ నియంత్రణలో ఈగల్ సేవలు భేష్

**హైదరాబాద్, మహా :** పోలీస్ శాఖలో కొత్తగా 5 వేల పోస్టుల భర్తీకి చర్యలు తీసుకున్నామని, హోంగార్డులకు ఎక్స్‌గ్రేషియా పెంచుతున్నట్లు తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. గోషామహల్ స్టేడియంలో నిర్వహించిన 'పోలీస్ అమరవీరుల సంస్మరణ దినం' కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొని ప్రసంగించారు. ఈ రోజు మనందరికీ ఎంతో భావోద్వేగమైన రోజు, సమాజ రక్షణ కోసం ప్రాణ త్యాగం చేసిన దేవ్ సింగ్, ప్రమోద్ కుమార్, గాజుల సౌమ్య వంటి పోలీసు అమరులను స్మరించుకుంటూ నివాళులు అర్పించారు. శాంతిభద్రతల పరిరక్షణలో వారి త్యాగాలను సమాజం ఎప్పటికీ **మిగతా 2 వ పేజీలో**

## అంగరంగవైభవంగా జంబూ సవారీ

02

వేడుకలకు హాజరైన సీఎం రేవంత్ రెడ్డి
దేశ, విదేశాల ప్రముఖుల రాక





## ఎక్సైజ్ శాఖకు దసరా కిక్కు

- నాలుగు రోజుల్లో రూ. 755 కోట్ల మద్యం విక్రయాలు

02



## మన సంస్కృతిని ద్వేషించేవారే దేశానికి పెద్ద శత్రువులు

02



రావణ దహనంలో మోదీ





# ఎక్సైజ్ శాఖకు దసరా కిక్కు

**నాలుగు రోజుల్లో రూ. 755 కోట్ల మద్యం విక్రయాలు**

హైదరాబాద్, మహా : తెలంగాణలో దసరా పండుగ సందర్భంగా మద్యం అమ్మకాలు భారీగా నమోదయ్యాయి. గత ఏడాదితో పోలిస్తే ఈసారి విక్రయాలు గణనీయంగా పెరిగినట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. పండుగల సమయంలో మద్యం కొనుగోళ్లు ఊపందుకోవడంతో రాష్ట్ర ఎక్సైజ్ శాఖకు ఆదాయం భారీగా సమకూరుతోంది. బోనాల ఉత్సవాలతో మొదలయ్యే ఈ అమ్మకాల జోరు దసరా, దీపావళి, క్రిస్మస్, నూతన సంవత్సరం వేడుకలతో పాటు సంక్రాంతి వరకు కొనసాగుతుంటుంది. ఈ నేపథ్యంలో దసరా సీజన్‌లో నమోదైన విక్రయాలు మరోసారి చర్చనీయాంశంగా మారాయి.

**నాలుగు రోజుల్లో రూ.755 కోట్లకు పైగా విక్రయాలు**

ఎక్సైజ్ శాఖ అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం.. నాలుగు రోజుల్లోనే రాష్ట్రవ్యాప్తంగా రూ.755 కోట్ల 14 లక్షల విలువైన మద్యం అమ్మకాలు జరిగాయి. ఈ విక్రయాల్లో హార్డ్ లిక్కర్‌తో పాటు బీరు కూడా గణనీtయమైన స్థాయిలో అమ్ముడైంది. నాలుగు రోజుల వ్యవధిలో 6.83 లక్షల కేసుల హార్డ్ లిక్కర్ విక్రయించగా, బీరు అమ్మకాలు 10.44 లక్షల కేసులకు చేరుకున్నాయి. తెలంగాణలో బీరు వినియోగం అధికంగా ఉంటుందనే విషయాన్ని ఈ గణాంకాలు మరోసారి స్పష్టం చేస్తున్నాయి. భారీ స్థాయిలో మద్యం విక్రయాలు జరగడంతో ప్రభుత్వానికి ఆదాయం కూడా పెరిగింది.

**ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో రూ.25 కోట్ల వ్యాపారం**

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోనూ దసరా సందర్భంగా మద్యం విక్రయాలు భారీగా జరిగాయి. అక్టోబర్ 16, 17, 18 తేదీల్లో కలిపి రూ.25 కోట్ల విలువైన మద్యం అమ్ముడైనట్లు వివరాలు సూచిస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలో మొత్తం 151 వైన్ షాపులు, 30 బార్లు ఉన్నాయి. వీటి ద్వారా జరిగిన విక్రయాలు పండుగ సమయంలో మద్యం కొనుగోళ్లు ఏ స్థాయిలో ఉన్నాయో తెలియజేస్తున్నాయి.



# ఏపీలో 19 మున్సిపాలిటీల ఎన్నికల ప్రక్రియకు బ్రేక్

- **అభ్యర్థుల తుది జాబితా ప్రచురణను నిలిపివేయాలని సుప్రీం ఉత్తర్వులు**
- **సుప్రీంకోర్టు సూచనలతో ఎస్ఈసీ కీలక నిర్ణయం**

**అమరావతి, మహా** : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ కొనసాగుతున్న వేళ రాష్ట్ర ఎన్నికల సంఘం కీలకమైన నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని 19 మున్సిపాలిటీల్లో ఎన్నికల ప్రక్రియకు తాత్కాలికంగా బ్రేక్ వేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. సుప్రీంకోర్టు జారీ చేసిన ఉత్తర్వుల నేపథ్యాన్ని పరిశీలించిన తర్వాతే తదుపరి చర్యలు తీసుకోవాలని ఎస్ఈసీ భావించింది. అందులో భాగంగానే మొత్తం 19 మున్సిపాలిటీల్లో నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియను నిలిపివేసింది. అదేవిధంగా పోటీలో ఉన్న అభ్యర్థుల తుది జాబితా ప్రకటనను హోల్డ్‌లో పెట్టింది.

**సుప్రీంకోర్టు ఉత్తర్వుల పరిశీలన**

రాష్ట్రంలో స్థానిక ఎన్నికల సందర్భంగా పలు ప్రాంతాల్లో అధికార పార్టీ వేధింపులు, ఆటంకాల వల్ల వైసీపీ అభ్యర్థులు నామినేషన్లు వేయలేకపోయారని, నామినేషన్ల గడువు పెంపుతో పాటు ఆయా ప్రాంతాల్లో తగిన రక్షణ కల్పించాలని కోరుతూ తాజాగా వైసీపీ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు ధర్మాసనం కీలక ఆదేశాలు ఇచ్చింది. అదేవిధంగా ఎన్నికలు ప్రజాస్వామ్య బద్ధంగా, పారదర్శకంగా నిర్వహించడం రాజ్యాంగ ప్రాథమిక సూత్రమని స్పష్టం చేసింది. నామినేషన్లు వేయలేకపోయిన అభ్యర్థుల నుంచి వచ్చిన విజ్ఞప్తులు, ఆధారాన్ని బట్టి కేస్‌టుకేస్ ప్రాతిపదికన రాష్ట్ర ఎన్నికల సంఘమే స్వయంగా పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని సూచించింది. ఈ ఫిర్యాదులపై ఎస్ఈసీ తుది నిర్ణయం తీసుకునే వరకు తుది అభ్యర్థుల జాబితా ప్రకటనను నిలిపివేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఈ క్రమంలోనే రాష్ట్ర ఎన్నికల సంఘం 19 మున్సిపాలిటీల్లో ఎన్నికలను తాత్కాలికంగా నిలిపివేయడం ప్రాధాన్యతను సంతరించుకుంది.





# పోలీస్ శాఖలో 7,437 పోస్టుల భర్తీకి అనుమతి ఇచ్చాం

( మొదటి పేజీ తరువాయి )

మరచిపోదని, అమరుల కుటుంబాలు ఒంటరి కావు అని, ప్రభుత్వం వారికి సంపూర్ణ అండగా ఉంటుందన్నారు. రాష్ట్ర అభివృద్ధికి శాంతిభద్రతల పరిరక్షణ ఎంతో ముఖ్యం కాబట్టి, తమ ప్రభుత్వం పోలీస్ శాఖకు అత్యున్నత ప్రాధాన్యత ఇస్తుందని స్పష్టం చేశారు. కొత్తగా పోస్టుల భర్తీ, అమరులకు పరిహారం పెంపు పోలీస్ శాఖను బలోపేతం చేసేందుకు ఈ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. 4,773 కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చాం. పోలీసుశాఖలో మొత్తం 7,437 పోస్టుల భర్తీకి అనుమతి ఇచ్చాం. మిగతా ఖాళీలను కూడా విడతల వారీగా భర్తీ చేస్తాం. 2028 నాటికి అన్ని ఖాళీలను భర్తీ చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా 112 మంది డీఎస్పీలను నియమించామని, ట్రాన్స్‌జెండర్లను ట్రాఫిక్ అసిస్టెంట్లుగా నియమించి వారి ఆత్మగౌరవాన్ని పెంచామన్నారు. విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన పోలీసు కుటుంబాలకు ఇచ్చే ఎక్స్‌గ్రేషియాను భారీగా పెంచినట్లు వివరించారు. కానిస్టేబుళ్ల ఎక్స్‌గ్రేషియాను రూ.40 లక్షల నుండి రూ.1 కోటికి, హెడ్ కానిస్టేబుళ్లు/ఏఎస్ఐలకు రూ.45 లక్షల నుండి రూ.1 కోటికి, ఎస్ఐలకు రూ.45 లక్షలు, ఇన్‌స్పెక్టర్లకు రూ.50 లక్షల నుండి రూ.1.25 కోట్లకు, డీఎస్పీ/అడిషనల్ ఎస్పీలకు రూ.50 లక్షల నుండి రూ.1.50 కోట్లకు, ఎస్పీ/ఐపీఎస్ అధికారులకు రూ.1 కోటి నుండి రూ.2 కోట్లకు పెంచామని తెలిపారు.



విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయే హోంగార్డుల కుటుంబాలకు ప్రస్తుతం అందిస్తున్న రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియాను రూ.10 లక్షలకు పెంచాలని డీజీపీని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఇది కేవలం ఆర్థిక సాయం మాత్రమే కాదని, అమరవీరుల కుటుంబాలకు ప్రభుత్వం ఇచ్చే గౌరవమని వ్యాఖ్యానించారు. అలాగే, హోంగార్డు నుంచి డీజీపీ స్థాయి అధికారుల పిల్లల చదువు కోసం 'యంగ్ ఇండియా పోలీస్ స్కూల్'ను ప్రారంభించామని తెలిపారు. విధి నిర్వహణలో దేశవ్యాప్తంగా 150 మంది పోలీసు సిబ్బంది ప్రాణాలు కోల్పోయారని ఆయన పేర్కొన్నారు. పోలీసులు తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ప్రజల భద్రత కోసం పనిచేస్తున్నారని, వారి త్యాగాల వల్లే ప్రజలు ప్రశాంతంగా జీవించగలుగుతున్నారని అన్నారు. దేశం, సమాజం కోసం ప్రాణాలర్పించిన అమరవీరులను ఎప్పటికీ మర్చిపోబోమని స్పష్టం చేశారు. అమరుల కుటుంబాలకు పరిహారంతోపాటు ఇతర సంక్షేమ ప్రయోజనాలు కూడా అందించనున్నట్లు సమాచారం. పోలీసు భద్రతా నిధి నుంచి రూ.16 లక్షలు, పోలీసు సంక్షేమ నిధి నుంచి రూ.8 లక్షలు అదనంగా అందించనున్నారు. నిబంధనలకు అనుగుణంగా అర్హులైన కుటుంబ సభ్యులకు ప్రభుత్వ ఉద్యోగాలు, నివాస స్థలాలు, పిల్లలకు ఉచిత విద్య, వైద్య సదుపాయాలు, బస్ పాస్‌లు కల్పించనున్నారు. పిల్లలకు వైద్య విద్యలో ప్రత్యేక రిజర్వేషన్లు కూడా అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు.

మాదకద్రవ్యాల నియంత్రణలోనూ తెలంగాణ పోలీసు శాఖ కీలక గుర్తింపు సాధించిందని రేవంత్ రెడ్డి వెల్లడించారు. రాష్ట్రానికి చెందిన ఈగల్ తెలంగాణ బృందం జాతీయ స్థాయి డ్రగ్స్ నియంత్రణ సమీక్షలో ఏడు ప్రమాణాల ఆధారంగా 80 శాతానికి పైగా స్కోరు సాధించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈగల్ బృందాన్ని, డీజీపీ సీవీ ఆనంద్‌ను అభినందించారు. యువతను మాదకద్రవ్యాల ప్రభావం నుంచి రక్షించేందుకు సమన్వయంతో పనిచేయాలని పోలీసు శాఖకు సూచించారు. ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణలో పోలీసులు నిర్వహిస్తున్న పాత్ర వెలకట్టలేనిదని ఈ సందర్భంగా సీఎం పేర్కొన్నారు. అమరవీరుల త్యాగాలను స్మరించుకోవడంతోపాటు వారి కుటుంబాలకు అండగా నిలవడం ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు. పోలీసు సంక్షేమం, ప్రజా భద్రత, మాదకద్రవ్యాల నియంత్రణకు సమాన ప్రాధాన్యం ఇస్తూ ముందుకు సాగుతామని తెలిపారు.





# అంగరంగవైభవంగా జంబూ సవారీ

**వేడుకలకు హాజరైన సీఎం రేవంత్ రెడ్డి**

**దేశ, విదేశాల ప్రముఖుల రాక**

**మైసూరు :** కర్ణాటకలోని మైసూరు నగరం విజయదశమి వేడుకలతో సందడిగా మారింది. 11 రోజుల పాటు వైభవంగా నిర్వహించిన మైసూరు దసరా ఉత్సవాల ముగింపు ఘట్టంలో భాగంగా బుధవారం విజయదశమి ఊరేగింపు ప్రారంభమైంది. రాష్ట్ర పండుగగా జరుపుకునే ఈ ఉత్సవాలు కర్ణాటక సంస్కృతి, సంప్రదాయాలు, పూర్వపు రాజవైభవాన్ని ప్రతిబింబించాయి. సాయంత్రం జరిగే ప్రసిద్ధ 'జంబూ సవారీ'ని వీక్షించేందుకు వేలాది మంది ప్రజలు తరలివచ్చారు. 'ప్రశాంత' అనే ఏనుగు నేతృత్వంలో అలంకరించిన 12 ఏనుగులు ఈ ఊరేగింపులో పాల్గొననున్నాయి. 750 కిలోల బరువున్న బంగారు పూత పూసిన అంబారీలో చాముండేశ్వరి దేవి విగ్రహాన్ని ఉంచి ఊరేగించడం ఈ వేడుకల్లో ప్రధాన ఆకర్షణగా నిలిచింది. మైసూరు దసరా వేడుకలను వీక్షించేందుకు వివిధ దేశాలకు చెందిన దౌత్యవేత్తలు, విదేశీ ప్రముఖులు హాజరయ్యారు. యూరోపియన్ యూనియన్ రాయబారి జీన్‌ఎరిక్ పాక్వెట్, చైనా రాయబారి జు ఫీహాంగ్, భారతదేశంలో ఈక్వెడార్ రాయబారి ఫెర్నాండో బుచెలి, మొజాంబిక్ హైకమిషనర్ అర్మాండో పెడ్రో, బల్గేరియా రాయబారి నికోలే యాంకోవ్, బ్రిటన్ డిప్యూటీ హైకమిషనర్ హర్షబీర్ సంఘా ఈ కార్యక్రమానికి వచ్చిన వారిలో ఉన్నారు. కర్ణాటక ఉన్నత విద్యాశాఖ మంత్రి బసవరాజ్ రాయరెడ్డి వారికి స్వాగతం పలికారు. డానిష్ కాన్సుల్ జనరల్ పీటర్ వింతర్, ఇజ్రాయెల్ కాన్సుల్ జనరల్ ఓర్లీ వీట్జ్‌మాన్, ఆస్ట్రేలియన్ కాన్సుల్ జనరల్, అర్మేనియా రాయబార కార్యాలయ కౌన్సిలర్ మారత్ మెలికియన్ కూడా వేడుకల్లో పాల్గొన్నారు. కర్ణాటక ముఖ్యమంత్రి డి.కె. శివకుమార్ ఆహ్వానం మేరకు తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి, కేరళ సీఎం వి.డి. సతీశన్ కూడా ఈ ఏడాది వేడుకలకు హాజరవుతున్నట్లు అధికారిక వర్గాలు తెలిపాయి. దేశ, విదేశాల ప్రముఖుల రాకతో మైసూరు దసరా ఉత్సవాలకు మరింత ప్రాధాన్యం ఏర్పడింది.









# పట్టభద్రుల సమస్యల పరిష్కారమే కాంగ్రెస్ లక్ష్యం.. : ఎమ్మెల్యే పాయం..

- **ఎమ్మెల్సీ ఎన్నికల్లో సమష్టిగా పనిచేయాలి..**
- **పట్టభద్రుల సన్నాహక సమావే-శంలో ఎంపీలు రఘురామరెడ్డి, బలరాం నాయక్**

**మణుగూరు, మహా** : పట్టభద్రుల సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఖమ్మం, వరంగల్, నల్లగొండ ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో మణుగూరులోని డీవీఆర్ ఫంక్షన్ హాల్‌లో కాంబగ్రెస్ పార్టీ పినపాక నియోజకవర్గ స్థాయి సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు దేవి ప్రసన్న, కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ రెడ్డి, ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురామరెడ్డి, మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్, ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

**పట్టభద్రుల సమస్యలపై ప్రత్యేక దృష్టి.. : పాయ**

ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నిరుద్యోగ యువత, పట్టభద్రుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందన్నారు. విద్య, ఉపాధి అవకాశాల కల్పనతో పాటు యువత భవిష్యత్తుకు భరోసా కల్పించే దిశగా చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. పట్టభద్రుల సమస్యలను శాసన మండలిలో సమర్థంగా వినిపించే నాయకత్వం అవసరమన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని నియోజకవర్గంలోని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

**యువత భవిష్యత్తుకు ప్రాధాన్యం.. : ఎంపీ రఘు** రామరెడ్డి ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురామ రెడ్డి మాట్లాడుతూ పట్టభద్రులు, నిరుద్యోగ యువత ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రజాప్రతినిధులు బాధ్యతగా పనిచేయాలన్నారు. విద్యావంతుల ఆలోచనలు, సూచనలు ప్రభుత్వ విధానాల రూపకల్పనలో కీలకమని పేర్కొన్నారు. ఉపాధి అవకాశాలు, నైపుణ్యాభివృద్ధి, ఉన్నత విద్యా రంగాలపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేయాలని పార్టీ శ్రేణులకు సూచించారు.

**పట్టభద్రుల గొంతుకగా నిలవాలి.. : ఎంపీ బలరాం నాయక్**

మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్ మాట్లాడుతూ విద్యావంతుల సమస్యలను చట్టసభల్లో ప్రస్తావించి పరిష్కారానికి కృషి చేసే ప్రతినిధులు అవసరమన్నారు. గ్రామీణ ప్రాంతాల పట్టభద్రులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడాలని ఆకాంక్షించారు. యువత ఆశయాలకు అనుగుణంగా విద్యా, ఉపాధి రంగాల్లో మరిన్ని అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పనిచేయాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ రెడ్డి మాట్లాడుతూ పట్టభద్రులు, నిరుద్యోగ యువత ఎదుర్కొంటున్న సమస్యలను శాసనమండలి వేదికగా ప్రస్తావించేందుకు కృషి చేస్తానన్నారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు దేవి ప్రసన్న మాట్లాడుతూ ఎన్నికల సన్నాహాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయం అవసరమని పేర్కొన్నారు. సమావేశంలో బూర్గంపాడు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తోలెం కళ్యాణి, కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నియోజకవర్గ నాయకులు, మండలాల నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సూర్యాపేటలో గ్యాస్ సిలిండర్ పేలుడు

- **సూపర్ మార్కెట్ అగ్నికి ఆహుతి**
- **భారీగా చోటు చేసుకున్న ఆస్తి నష్టం**



**సూర్యపేట, మహా** : సూర్యాపేట పట్టణంలో దసరా పండుగ వేళ భారీ పేలుడు సంభవించడం కలకలం రేపింది. స్థానిక పీఎస్ఎస్ఆర్ సెంటర్ సమీపంలోని శ్రీసాయి సూపర్ మార్కెట్‌లో మంగళవారం గ్యాస్ సిలిండర్ పేలడంతో భవనం తీవ్రంగా ధ్వంసమైంది. పేలుడు ధాటికి భారీ శబ్దం రావడంతో పరిసర ప్రాంతాల ప్రజలు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. ఏం జరిగిందో తెలియక భయాందోళనలకు గురై ఇళ్ల నుంచి, దుకాణాల నుంచి బయటకు పరుగులు తీశారు. పండుగ వేళ చోటుచేసుకున్న ఈ ఘటన స్థానికంగా తీవ్ర ఆందోళనకు దారితీసింది.ప్రాథమిక అంచనాల ప్రకారం.. గ్యాస్ లీకేజీ కారణంగానే సిలిండర్ పేలి ఉండవచ్చునని భావిస్తున్నారు. పేలుడు తీవ్రతకు సూపర్ మార్కెట్ భవనానికి భారీ నష్టం వాటిల్లింది. దుకాణంలోని వస్తువులు, ఇతర సామగ్రి కూడా దెబ్బతిన్నాయి. ఈ ఘటనతో వ్యాపార ప్రాంతంలో చోటు చేసుకోవటంతో ఒక్కసారిగా గందరగోళం నెలకొంది. పేలుడు శబ్దం చాలా దూరం వరకు వినిపించడంతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు. ప్రమాదం కారణంగా తమకు భారీగా ఆస్తి నష్టం జరిగిందని సూపర్ మార్కెట్ నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేశారు. పండుగ సమయంలో వ్యాపారం జరుగుతున్న వేళ ఈ ఘటన చోటు చేసుకోవడంతో తీవ్ర నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా, సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. ప్రమాదం జరిగిన తీరును పరిశీలించి వివరాలు సేకరించారు. ఘటనకు దారితీసిన పరిస్థితులపై విచారణ ప్రారంభించారు. గ్యాస్ సిలిండర్ నుంచి లీకేజీ జరిగిందా, సిలిండర్ పేలడానికి ఇతర కారణాలేమైనా ఉన్నాయా అనే కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటనలో ఎటువంటి ప్రాణనష్టం జరగపోవటంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. తాజా ప్రమాదం నేపథ్యంలో గ్యాస్ సిలిండర్ల వినియోగం, నిల్వ, భద్రతా ప్రమాణాలపై మరోసారి చర్చ మొదలైంది. ముఖ్యంగా దుకాణాలు, వాణిజ్య సముదాయాల్లో గ్యాస్ పరికరాలను ఉపయోగించే సమయంలో లీకేజీలను ముందుగానే గుర్తించడం, సిలిండర్లను సురక్షితంగా ఉంచడం, ప్రమాద నివారణ చర్యలు పాటించడం ఎంత ముఖ్యమో ఈ ఘటన గుర్తుచేస్తోంది. కాగా, రెండ్రోజుల క్రితం హైదరాబాద్ మదీనా సమీపంలోనూ భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. ఓ బట్టల గోదాంలో మంటలు చెలరేగి క్షణాల్లోనే బట్టలు కాలి బూడిదయ్యాయి. ఈ ఘటనలోనూ భారీగా ఆస్తి నష్టం చోటు చేసుకుంది.

## తొలి రోజే జియో ప్లాట్‌ఫామ్స్ ఐపీఓకు భారీ స్పందన

**మహా :** జియో ప్లాట్‌ఫామ్స్ ఐపీఓకు తొలిరోజే భారీ స్పందన లభించింది. రూ.30,213 కోట్ల విలువైన ఈ పబ్లిక్ ఇష్యూకు బుధవారం మధ్యాహ్నం 3.15 గంటల సమయానికి 2.5 రెట్లు బిడ్లు వచ్చాయి. దేశంలోనే అతిపెద్ద పబ్లిక్ ఆఫరింగ్‌గా నిలిచిన ఈ ఐపీఓ అక్టోబర్ 23 వరకు అందుబాటులో ఉంటుంది. బీఎస్ఈ గణాంకాల ప్రకారం.. ఆఫర్‌లో 19.75 కోట్ల షేర్లు ఉండగా, 49.56 కోట్ల షేర్ల కోసం బిడ్లు దాఖలయ్యాయి. సంస్థాగత పెట్టుబడిదారుల నుంచి అత్యధిక స్పందన వచ్చింది. క్వాలిఫైడ్ ఇన్‌స్టిట్యూషనల్ బయ్యర్స్ (క్యూఐబీ) విభాగం 7.46 రెట్లు సబ్‌స్క్రైబ్ అయింది. సంస్థాగతేతర పెట్టుబడిదారుల విభాగానికి 1.32 రెట్ల బిడ్లు వచ్చాయి. రిటైల్ పెట్టుబడిదారుల విభాగం మాత్రం 60 శాతమే సబ్‌స్క్రైబ్ అయింది. రిలయన్స్ ఇండస్ట్రీస్ వాటాదారుల కోసం కేటాయించిన విభాగం 1.16 రెట్లు సబ్‌స్క్రైబ్ అయింది. ఈ విభాగంలో అందుబాటులో ఉన్న 2.23 కోట్ల షేర్లకుగానూ 2.59 కోట్ల షేర్ల కోసం బిడ్లు వచ్చాయి. ఉద్యోగుల కోసం కేటాయించిన విభాగం కూడా పూర్తిగా సబ్‌స్క్రైబ్ అయింది. ఐపీఓకు ముందు జియో ప్లాట్‌ఫామ్స్ 212 మంది యాంకర్ ఇన్వెస్టర్ల నుంచి రూ.8,109.84 కోట్లు సమీకరించింది. సింగపూర్‌కు చెందిన జీఐసీ, నార్జెస్ బ్యాంక్ ఇన్వెస్ట్‌మెంట్ మేనేజ్‌మెంట్, అబుదాబి ఇన్వెస్ట్‌మెంట్ అథారిటీ సహా పలు అంతర్జాతీయ పెట్టుబడి సంస్థలు ఇందులో పాల్గొన్నాయి. ఎస్‌బీఐ, ఐసీఐసీఐ ప్రుడెన్షియల్, హెచ్‌డీఎఫ్‌సీ, నిప్పాన్ ఇండియా వంటి దేశీయ సంస్థలూ పెట్టుబడులు పెట్టాయి.



## మన సంస్కృతిని ద్వేషించేవారే దేశానికి పెద్ద శత్రువులు

**- రావణ దహనంలో మోదీ**

ఢిల్లీ, మహా : దేశ సంస్కృతి, సంప్రదాయాలను ద్వేషించేవారు దేశానికి పెద్ద శత్రువులు అని ప్రధాని నరేంద్రమోదీ స్పష్టం చేశారు. సమాజాన్ని విభజించేవారు ఎంతటి పెద్దవారైనా సరే దేశ ప్రజలంతా ఐక్యంగా ఉండి వారిని సమర్థంగా ఎదుర్కోవాలని ఢిల్లీలో జరిగిన దసరా వేడుకల్లో పిలుపునిచ్చారు. దేశప్రయోజనాల విషయంలో అన్ని రాజకీయ పార్టీలు, సంస్థలు ఒక్కతాటిపై నిలబడాలన్నారు. తూర్పు ఢిల్లీలోని ఇంద్రప్రస్థ ప్రాంతంలో మంగళవారం జరిగిన దసరా వేడుకల్లో ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన మోదీ దసరా వేడుకలు దేశమంతటినీ ఏకం చేస్తాయని తెలిపారు. సుపరిపాలనకు రామరాజ్యం విజయవంతమైన నమూనా అని పేర్కొన్నారు. ప్రస్తుతం మన అందరి ముందు వికసిత్ భారత్ అనే లక్ష్యం ఉందని గుర్తుచేశారు. వికసిత్ భారత్ లక్ష్యసాధనలో రాముడి నుంచి స్ఫూర్తి పొందాలని ప్రధాని సూచించారు. భారతీయ పండుగలను ఐరాస కూడా గుర్తిస్తోందని చెప్పారు. మన నాగరికతే మన గుర్తింపు అని స్పష్టం చేశారు. ఇదే సమయంలో దేశ శత్రువులను వదిలిపెట్టేది లేదని ప్రజలంతా సంకల్పం తీసుకోవాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. అనంతరం ప్రధాని మోదీ బాణాన్ని సంధించి రావణ, కుంభకర్ణలను దహనం చేశారు.

## సీఎంఆర్ఎల్ కేసు
# సుప్రీం కోర్టులో కేరళం మాజీ సీఎం పినరయి కుటుంబానికి ఊరట

- **వారం రోజుల పాటు విచారణపై స్టే విధించిన సుప్రీంకోర్టు**
- **హైకోర్టు డివిజన్ బెంచ్‌లో అప్పీల్ చేసుకునేందుకు అనుమతి**
- **ఫ్ఐఆర్‌ను రద్దు చేయలేదని స్పష్టం చేసిన ధర్మాసనం**



**న్యూఢిల్లీ, మహా :** సీఎంఆర్ఎల్-ఎక్సాలాజిక్ అవినీతి కేసులో కేరళం మాజీ ముఖ్యమంత్రి, ప్రస్తుత ప్రతిపక్ష నేత పినరయి విజయన్‌తో పాటు ఆయన కుటుంబ సభ్యులకు సుప్రీంకోర్టులో భారీ ఊరట లభించింది. విజయన్, ఆయన కుమార్తె వీణ, అల్లుడు పీఏ మహమ్మద్ రియాస్‌లపై కేరళ విజిలెన్స్ విభాగం చేస్తున్న దర్యాప్తుపై వారం రోజుల పాటు స్టే విధిస్తూ అత్యున్నత న్యాయస్థానం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. దసరా సెలవుల సందర్భంగా ప్రత్యేకంగా సమావేశమైన జస్టిస్ జాయ్‌మాల్య బాగ్చి, జస్టిస్ వి. మోహనలతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌ను విచారించింది. ఎఫ్ఐఆర్‌ను సవాలు చేసేందుకు పిటిషనర్లకు అవకాశం నిరాకరిస్తూ కేరళ హైకోర్టు డివిజన్ బెంచ్ ఇచ్చిన ఉత్తర్వులను సుప్రీంకోర్టు పక్కనపెట్టింది. ఈ కేసులో వారం రోజుల్లోగా హైకోర్టు డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించి అప్పీల్ చేసుకునేందుకు వారికి అనుమతి ఇచ్చింది. కోచిన్ మినరల్స్ అండ్ రూటైల్ లిమిటెడ్ (సీఎంఆర్ఎల్) నుంచి వీణకు చెందిన ఎక్సాలాజిక్ సొల్యూషన్స్ సంస్థకు ఎలాంటి సేవలు అందించకుండానే రూ. 2.78 కోట్లకు పైగా అక్రమంగా చెల్లింపులు జరిగాయనే ఆరోపణలపై ఈ కేసు నమోదైంది. ఈడీ ఇచ్చిన సమాచారం ఆధారంగా కేరళ విజిలెన్స్ అండ్ యాంటీ కరప్షన్ బ్యూరో (వీఏసీబీ) ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. అయితే, తాము ఎఫ్ఐఆర్‌ను రద్దు చేయడం లేదని, కేవలం దర్యాప్తును మాత్రమే వారం పాటు నిలిపివేస్తున్నట్లు ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ సందర్భంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) తీరుపై కూడా కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. "చట్టబద్ధమైన పరిమితులను దాటి జోక్యం చేసుకోవద్దు" అని హెచ్చరించింది. తదుపరి మధ్యంతర ఉత్తర్వులపై కేరళ హైకోర్టు స్వతంత్రంగా నిర్ణయం తీసుకోవచ్చని తెలిపింది.



## ఉర్సు లో అంబరాన్నంటిన దసరా వేడుకలు

- **రంగలీల మైదానంలో రావణవధ**
- **రావణుడి ప్రతిమకు నిప్పంటించిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, జిల్లా కలెక్టర్, కమిషనర్లు,కుడా చైర్ పర్సన్, ప్రజా ప్రతినిధులు**



**ఉర్సు మహా** : విజయదశమి సందర్భంగా వరంగల్‌లోని ఉర్సు రంగలీల మైదానంలో దసరా వేడుకలు వైభవంగా జరిగాయి. ఉర్సు దసరా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన రావణవధ కార్యక్రమానికి ప్రజలు భారీగా తరలివచ్చారు. మాజీ మంత్రి, వరంగల్ తూర్పు ఎమ్మెల్యే కొండా సురేఖ, కుడా చైర్పర్సన్ గుండు సుధారాణి, వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్య శారద, పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత ,ప్రజా ప్రధినిధులు తదితరులు రావణుడి ప్రతిమకు నిప్పంటించారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య,రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య , గ్రంథాలయ సంస్థ చైర్మన్ మీసాల ప్రకాశ్, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ వెంకన్న తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్ మాట్లాడుతూ, చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. ఉర్సు రంగలీల మైదానంలో సంప్రదాయబద్ధంగా దసరా వేడుకలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని తెలిపారు. ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య మాట్లాడుతూ, మైసూరు తర్వాత రంగలీల మైదానంలో జరిగే దసరా వేడుకలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయని పేర్కొన్నారు. ప్రజలందరికీ విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య ప్రజలకు పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఎమ్మెల్యే కొండా సురేఖ మాట్లాడుతూ, విజయదశమి చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. భద్రకాళి అమ్మవారి కృపతో సమృద్ధిగా వర్షాలు కురవాలని ఆకాంక్షించారు. రైతులు బాగుంటేనే దేశం అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు.డా చైర్‌పర్సన్ గుండు సుధారాణి మాట్లాడుతూ, నగరంలో దసరా సందర్భంగా నిర్వహించే రథయాత్ర సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రజలు నీరు, విద్యుత్‌ను పొదుపుగా వినియోగించాలని సూచించారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద మాట్లాడుతూ, ప్రజలందరికీ విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. శ్రీరాముడి సుగుణాలు, ఆదర్శవంతమైన జీవనం కారణంగానే ఆయనను ప్రజలు దైవంగా కొలుస్తున్నారని పేర్కొన్నారు. పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత మాట్లాడుతూ, చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా విజయదశమిని జరుపుకుంటామని తెలిపారు.

కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎల్. కిషోర్ కుమార్, ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్, సెంట్రల్ జోన్ డీసీపీ దారా కవిత, వరంగల్ ఆర్డీవో సుమ, ఖిలా వరంగల్ తహసీల్దార్ ఇక్బాల్ తదితర అధికారులు పాల్గొన్నారు.ప్రభుత్వ శాఖల సమన్వయంతో వేడుకలకు ఏర్పాట్లు చేశారు. దసరా ఉత్సవ కమిటీ గౌరవ అధ్యక్షుడు గోపాల్ నవీన్ రాజు, అధ్యక్షుడు నాగపూరి సంజయ్ బాబు, జనరల్ సెక్రటరీ మధుసూదన్‌తో పాటు ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, పోలీసు సిబ్బంది, నగర ప్రజలు పాల్గొన్నారు.రావణవధతో రంగలీల మైదానంలో పండుగ సందడి నెలకొంది. సంప్రదాయబద్ధంగా నిర్వహించిన వేడుకలు ప్రజలను ఆకట్టుకున్నాయి.ఈ సాంస్కృతిక కార్యక్రమాలు ప్రజలందరినీ ఆకట్టుకున్నాయి.

# ఎంపీటీసీ, జడ్ పీటీసీ నామినేషన్ల సమయంలో ఉద్రిక్తత

- **పల్నాడు, కడప, అన్నమయ్య జిల్లాల్లో మళ్లీ ఉద్రిక్తత**
- **పలుచోట్ల టీడీపీ, వైసీపీ రాళ్ల దాడులు**

**అమరావతి, మహా :** ఏపీలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నామినేషన్లు ప్రారంభమైన తొలిరోజే పలు జిల్లాల్లో ఉద్రిక్తతలు చోటుచేసుకున్నాయి. పల్నాడు జిల్లాలోని నరసరావుపేట, మాచర్ల, ముప్పాళ్ల ప్రాంతాల్లో ఎంపీటీసీ, జడ్పీటీసీ నామినేషన్ల దాఖలు సందర్భంగా తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయడానికి వెళ్తున్న సమయంలో టీడీపీ, వైసీపీ శ్రేణుల మధ్య తీవ్ర వాగ్వాదం, తోపులాట చోటుచేసుకుంది. ఇరువర్గాలు ఒకరిపైకొకరు పోటీపడి నినాదాలు చేసుకుని, చివరికి దాడులకు దిగడంతో నామినేషన్ కేంద్రాల వద్ద తీవ్ర ఘర్షణ వాతావరణం ఏర్పడింది. సమాచారం అందుకున్న పోలీసులు తక్షణమే రంగంలోకి దిగి, పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు ఇరువర్గాల నాయకులను, కార్యకర్తలను చెదరగొట్టారు.

పుంగనూరులో వైసీపీ, టీడీపీ వర్గీయుల మధ్య రాళ్ల దాడి

స్థానిక సంస్థల (ఎంపీటీసీ, జడ్పీటీసీ) నామినేషన్ల పర్వం అన్నమయ్య జిల్లాల్లోనూ పలుచోట్ల తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. అన్నమయ్య జిల్లా పుంగనూరులోని మున్సిపల్ హైస్కూల్ సమీపంలో వైసీపీ, టీడీపీ వర్గీయుల మధ్య చెలరేగిన వివాదం పరస్పరం రాళ్ల దాడికి దారితీసింది. అప్రమత్తమైన పోలీసులు వెంటనే రంగంలోకి దిగి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు.

మరోవైపు కడప జిల్లా పరిషత్ కార్యాలయం వద్ద సైతం టీడీపీ, వైసీపీ కార్యకర్తలు పరస్పరం దాడులకు దిగారు. ఈ క్రమంలో గుర్తుతెలియని వ్యక్తులు వారిపై రాళ్లు రువ్వడంతో అక్కడ భయాందోళన వాతావరణం నెలకొంది. పల్నాడు జిల్లా నరసరావుపేట ఆర్డీవో ఆఫీసులోని నామినేషన్ కేంద్రం వద్ద పిడుగురాళ్ల జడ్పీటీసీ వైసీపీ అభ్యర్థి భారతి, ఆమె భర్త లక్ష్మారెడ్డిపై ప్రత్యర్థులు దాడికి పాల్పడ్డారు. గాయాలపాలైన లక్ష్మారెడ్డిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

పల్నాడు జిల్లాలో నేతల హౌస్ అరెస్టులు

ఎంపీటీసీ, జడ్పీటీసీ నామినేషన్ల ప్రక్రియ సందర్భంగా పల్నాడు జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. పలువురు కీలక వైసీపీ నేతలను గృహనిర్బంధం చేయడంతో పాటు మరికొందరిని అదుపులోకి తీసుకున్నారు. మాచర్లలో మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని, పిడుగురాళ్లలో గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేశ్‌రెడ్డిని, వినుకొండలో మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మానాయుడిని బయటకు రాకుండా పోలీసులు వారి నివాసాల్లోనే హౌస్ అరెస్ట్ చేశారు. నరసరావుపేట నియోజకవర్గంలో పల్నాడు జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు అన్నెం పున్నారెడ్డి సహా రొంపిచర్ల మండలానికి చెందిన మాజీ సర్పంచ్‌లు, స్థానిక నేతల నివాసాల వద్ద పోలీసు పహారా ఏర్పాటు చేసి, శాంతిభద్రతలను పరిరక్షించేందుకు భద్రతను కట్టుదిట్టం చేశారు.



నరసరావుపేటలో వైయస్ఆర్‌సీపీ జెడ్పీటీసీ అభ్యర్థిగా నామినేషన్ వేయడానికి వస్తే.. టీడీపీ గూండాలు దాదాపు 10 మంది నా చీర లాగి వివస్త్రను చేయడానికి ప్రయత్నించారని వంగా పద్మావతి ఆరోపించారు. నామినేషన్ పత్రాలతో పాటు హ్యాండ్ బ్యాగ్‌ను కూడా రోడ్డుపైనే చించేశారని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రొద్దుటూరులో ఎమ్మెల్సీ రమేష్ యాదవ్ ని పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. జెడ్పిటిసి, ఎంపీటీసీ నామినేషన్ వేయకుండా వైసీపీ అభ్యర్థులను అడ్డుకునేందుకు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. అభ్యర్థులకి మద్దతుగా వెళ్లాలని చూస్తున్న రమేష్ యాదవ్ కి నోటీసులు ఇచ్చి హౌస్ అరెస్ట్ చేశారని పార్టీ నేతలు అంటున్నారు.

## పోలీస్ అమరవీరుల త్యాగాలు మరువలేనివి

- **కొవ్వొత్తుల ర్యాలీ తో అమరవీరులకు ఘన నివాళి**
- **వరంగల్ సీపీ ఎన్ శ్వేత, ఐపీఎస్**

**హనుమకొండ, మహా** : పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ, వారికి ఘన నివాళులర్పించేందుకు వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత, ఐపీఎస్ ఆధ్వర్యంలో బుధవారం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. హనుమకొండలోని అశోక జంక్షన్ నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌కు చేరుకుంది. అక్కడ అమరవీరుల స్థూపం వద్ద పోలీసు అధికారులు, సిబ్బంది అమర వీరులకు నివాళులర్పించారు. దేశ భద్రత, ప్రజల రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీసులు అందిస్తున్న సేవలను, విధి నిర్వహణలో వారు ఎదుర్కొంటున్న సవాళ్లను ప్రజలకు తెలియజేయడం, దేశం కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరుల సాహసాన్ని, అంకితభావాన్ని స్మరించుకోవడం ఈ ర్యాలీ ప్రధాన ఉద్దేశం. ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే కె ఆర్ నాగరాజు, ఈస్ట్ జోన్ డిసిపి అంకిత్ కుమార్, అడిషనల్ డిసిపి పరిపాలన రాయల ప్రభాకర్ రావు, మిగతా అడిషనల్ డిసిపిలు, సురేష్, శ్రీనివాస్, ఏసీపీలు, సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, ఆర్ ఎస్ఐలు పోలీస్ అధికారులు, సిబ్బంది, పోలీస్ అమరవీరుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



ANN తెలుగు
మహా పత్రిక
గురువారం,
హైదరాబాద్
22-10-2026

మహా ప్రత్యేకం



# అంగరంగా వైభవంగా దసరా సంబరాలు

## తెలుగు రాష్ట్రాలతో పాటు దేశవ్యాప్తంగా వేడుకలు

కొండారెడ్డిపల్లిలో సీఎం దసరా.. ఢిల్లీ ఇంద్రప్రస్థలో మోదీ
తెలంగాణలో జమ్మిపూజలు.. రావణదహనాలు
ఏపీలో కనులపండుగగా వేడుకలు
మైసూరు ఉత్సవాలు మహా లెవెల్

(మహా నెట్ వర్క్) తెలుగురాష్ట్రాలలో దసరా వేడుకలు కనులపండుగగా జరిగాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సొంతగ్రామం కొండారెడ్డిపల్లిలో దసరా ఉత్సవాల్లో పాల్గొన్నారు. పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ ఉప్పల్ నియోజకవర్గంలో జరిగిన వేడుకల్లో పాల్గొన్నారు. దసరా శోభతో తెలుగు రాష్ట్రాలు కళకళలాడుతున్నాయి. ఘనంగా విజయదశమి వేడుకలు జరిగాయి. తెలంగాణలో జమ్మిపూజలు, రావణదహనాలతో కోలాహలం కనిపించగా... ఆంధ్రప్రదేశ్‌లో అమ్మవారి దర్శనాలు, సంప్రదాయ వేడుకలతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. మరోవైపు దేశవ్యాప్తంగానూ దసరా ఉత్సవాలు అంబరాన్ని అంటుతుండగా... మైసూర్ దసరా వేడుకలు మాత్రం మహా లెవెల్‌లో విశ్వవ్యాప్తంగా ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. తూర్పు ఢిల్లీలోని ఇంద్రప్రస్థ ప్రాంతంలో మంగళవారం జరిగిన దసరా వేడుకల్లో ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన మోదీ దసరా వేడుకలు దేశమంతటినీ ఏకం చేస్తాయని తెలిపారు. సుపరిపాలనకు రామరాజ్యం విజయవంతమైన నమూనా అని పేర్కొన్నారు. మాజీ సీఎం కేసీఆర్ కుటుంబసభ్యులతో కలిసి ఎర్రవెల్లిలోని తన నివాసంలో వేడుకలు జరుపుకున్నారు.



























# విధి నిర్వహణలో అమరులైన వీరుల త్యాగాలు మరువలేనివి

- మందమర్రి సర్కిల్ ఆధ్వర్యంలో ఘనంగా పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం

**మందమర్రి, మహా** : దేశ రక్షణ, ప్రజా భద్రత కోసం విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన పోలీస్ అమర వీరుల త్యాగాలు మరువలేనివని, వారి స్ఫూర్తితో ప్రతి పోలీస్ అధికారి పనిచేయాలని మందమర్రి సీఐ పర్స రమేష్ అన్నారు. బుధవారం మందమర్రి పోలీస్ సర్కిల్ ఆధ్వర్యంలో (పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం) ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీఐ రమేష్ ముఖ్య అతిథిగా హాజరై అమరవీరుల స్థూపం వద్ద పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు.

అనంతరం సెరిమోనియల్ గార్డ్ ద్వారా శాస్త్రోక్తంగా ఆయుధాలను కిందకు దించి అమరవీరులకు సైనిక వందనం చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రజల ప్రాణ, ఆస్తి రక్షణ కోసం, శాంతిభద్రతల పరిరక్షణ కోసం రాత్రి పగలు శ్రమిస్తూ, విధి నిర్వహణలో అసువులు బాసిన అమరవీరుల త్యాగాలు ఎనలేనివన్నారు. వారి త్యాగనిరతి నేటి తరం పోలీసులకు స్ఫూర్తిదాయకమని కొనియాడారు.

**అమరవీరుల దినోత్సవం ఎందుకు జరుపుకుంటారు.?**

పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవానికి ఒక చారిత్రక నేపథ్యం ఉంది. 1959 అక్టోబర్ 21న లద్దాఖ్ లోని హాట్ స్ప్రింగ్స్ ప్రాంతంలో భారత్‌చైనా సరిహద్దు వద్ద సీఆర్పీఎఫ్ కు చెందిన 10 మంది జవాన్లు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా, చైనా సైనికులు అకస్మాత్తుగా దాడి చేశారు. ఈ దాడిలో 10 మంది భారత జవాన్లు వీరమరణం పొందారు. అప్పటి నుండి ప్రతి ఏటా అక్టోబర్ 21న దేశవ్యాప్తంగా పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహిస్తూ, విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసులందరికీ నివాళులు అర్పిస్తున్నారు.ఈ ఏడాది కూడా దేశవ్యాప్తంగా 200 మందికి పైగా పోలీసులు వివిధ ఘటనల్లో, ఉగ్రవాదుల దాడుల్లో, ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయారని, వారి కుటుంబాలకు అండగా ప్రభుత్వం ఉంటుందని సీఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో మందమర్రి ఎస్సై గోపతి నరేష్, కాసిపేట ఎస్సై ఆంజనేయులు, దేవాపూర్ ఎస్సై గంగారాం, రామకృష్ణాపూర్ ఎస్సై శ్రీధర్ తో పాటు మందమర్రి సర్కిల్ పరిధిలోని సిబ్బంది, పోలీస్ అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఘనంగా పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం

- హాజరైన ప్రజాప్రతినిధులు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి, కలెక్టర్, ఎస్పీ
- విధి నిర్వహణలో అసువులు బాసిన అమరులకు నివాళ్లు



**ఆదిలాబాద్ మహా** : శాంతి భద్రతల పరిరక్షణ దేశ సరిహద్దు రక్షణ కోసం విధి నిర్వహణలో అసువులు బాసిన పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం ఫ్లాగ్ డేను బుధవారం జిల్లాలోని ఏఆర్ హెడ్ క్వార్టర్స్ లో ఘనంగా నిర్వహించారు. అమరవీరుల స్థూపం వద్ద జిల్లా ప్రధాన న్యాయమూర్తి కె ప్రభాకర్ రావు, కలెక్టర్ రాజర్షి షా, జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, ఎంపీ గోడం నగేష్, న్యాయమూర్తి హుస్సేన్ నాయక్, అదనపు ఎస్పీ పి మౌనిక, ఎఎస్పీ రుత్విక్ సాయి కొట్టే, మున్సిపల్ చైర్మన్ బండారి అనూష, ఇతర శాఖల ఉన్నతాధికారులు పోలీసు ఉన్నతాధికారులు అమరవీరుల కుటుంబ సభ్యులతో కలిసి పుష్పగుచ్చాలతో నివాళులర్పించారు. దేశవ్యాప్తంగా ఈ సంవత్సరం విధి నిర్వహణలో అసువులు బాసిన 154 మంది పోలీసు సిబ్బంది, అధికారులను స్మరించుకున్నారు. అనంతరం సాయుధ పోలీసులు అమరవీరులకు సలామి శస్త్ర ద్వారా గౌరవ వందనాన్ని సమర్పించి, ఆయుధాలను తలకిందులుగా చేసి శ్రద్ధాంజలి ఘటించారు. రెండు నిమిషాలు మౌనం పాటించి అమరవీరులను స్మరించుకున్నారు. తదుపరి అమరవీరుల కుటుంబ సభ్యులతో మాట్లాడి ఎలాంటి సమస్యలనైనా పరిష్కరించే దిశగా జిల్లా పరిపాలన పోలీసు యంత్రాంగం పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఐఏఎస్ మాట్లాడుతూ తమ కుటుంబ సభ్యులను సైతం లెక్కచేయకుండా విధి నిర్వహణలో ఒక పోలీసు వ్యవస్థనే ఇతరుల కోసం ప్రాణాలను సైతం అర్పిస్తుందని తెలియజేశారు. పోలీసులు నిస్వార్థమైన సేవలను అందిస్తారని వారికి ప్రతి ఒక్కరూ సహకరిస్తూ నేర నియంత్రణలో తమ వంతు పాత్ర పోషించాలని సూచించారు. ప్రతి సంవత్సరం అమరవీరులను స్మరించుకుంటూ వారికి ప్రగాఢ సంతాపాన్ని తెలియజేయాలని వారి కుటుంబ సభ్యులను సమాజంలో ఉన్నత స్థానాలకు ఎదిగేలా కృషి చేయాలని తెలియజేశారు. జిల్లా అడ్మినిస్ట్రేషన్ తరఫున ఎలాంటి సహాయ సహకారాలైన అందిస్తామని హామీ ఇచ్చారు. విధి నిర్వహణలో పోలీసులు చేసిన త్యాగాలను నిరంతరం స్మరించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపిఎస్ మాట్లాడుతూ అక్టోబర్ 21న ప్రతి సంవత్సరం జరుపుకునే అమరవీరుల సంస్మరణ దినోత్సవం 66 సంవత్సరాల క్రితం లడక్ సమీపంలో భారత సరిహద్దుల్లో పహారకాస్తున్న మన పోలీసు సిబ్బందిపై చైనీయులు దాడి చేశారని, ఈ ప్రదేశాన్ని హాట్ స్ప్రింగ్ గా పేర్కొంటారని, 1959 అక్టోబర్ 21న ఆ సమయంలో విది నిర్వహణలో వీరోచితంగా పోరాడి అసువులు బాసిన పదిమంది సిఆర్పిఎఫ్ జవాన్ల వీరమరణం సందర్భంగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ప్రతి సంవత్సరం అక్టోబర్ 21న దేశవ్యాప్తంగా ఫ్లాగ్ డే దినోత్సవాన్ని అమరవీరుల ను స్మరించుకుంటూ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. వారి సంస్మరణ ఆదిలాబాద్ జిల్లా నందు పది రోజులపాటు, ప్రజాహిత కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ముఖ్యంగా నార్త్ తెలంగాణ లోని ఆదిలాబాద్ జిల్లాలో పోలీసులు సంఘవిద్రోహశక్తులతో పోరాడి చిరస్మరణీయులైన విషయం గుర్తు చేశారు. ప్రస్తుత ఆదిలాబాద్ జిల్లా ప్రశాంత వాతావరణం లో కొనసాగడానికి అసువులు బాసిన ప్రతి ఒక్క అమరవీరుల కుటుంబ సభ్యులకు చేతులెత్తి దండం పెడుతూ వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నందు 50 మంది పోలీసు అధికారులు సిబ్బంది సంఘవిద్రోహశక్తులతో ప్రాణాలను కోల్పోయారని తెలిపారు. వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని సంతాపాన్ని తెలియజేస్తూ ఎలాంటి అవసరాలైన జిల్లా పోలీసు యంత్రాంగాన్ని సంప్రదించాలని సూచించారు. ప్రస్తుత సమాజం డ్రగ్స్ కు వ్యతిరేకంగా పోరాడుతుందని, దేశంలోనే తెలంగాణ పోలీసు శాఖ అన్ని రంగాల్లో ముందుంటూ దేశానికి ఆదర్శప్రాయంగా నిలుస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అమరవీరుల కుటుంబ సభ్యులతో పాటు రెండవ బెటాలియన్ కమాండెంట్ బి వెంకటేశ్వర రెడ్డి, డీఎస్పీలు ఎల్ జీవన్ రెడ్డి, కమతం ఇంద్రవర్ధన్, ఆదిలాబాద్ జిల్లా సర్కిల్ ఇన్స్పెక్టర్లు, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు, రిజర్వ్ సబ్ ఇన్స్పెక్టర్లు, రెండవ బెటాలియన్ అధికారులు, ఇతర శాఖల ఉన్నతాధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## పోలీస్ అమరుల త్యాగాలు మరువలేనివి

**కుషాయిగూడ ఇన్స్పెక్టర్ భాస్కర్ రెడ్డి**

కుషాయిగూడ, మహా : పోలీస్ అమరవీరుల దినోత్సవం సందర్భంగా విధి నిర్వహణలో దేశం కోసం ప్రాణాలర్పించిన పోలీస్ అమరవీరులకు. బుధవారం కుషాయిగూడ పోలీసులు ఘన నివాళులర్పించారు. ప్రజల రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణ, సమాజంలో శాంతి స్థాపన కోసం పోలీసులు చేస్తున్న సేవలు అమూల్యమైనవని పేర్కొన్నారు. ప్రజల ప్రాణ, ఆస్తుల రక్షణ కోసం పోలీసులు నిబరంతరం అంకితభావంతో పనిచేస్తున్నారని, విధి నిర్వహణలో ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటూ ప్రజలకు భద్రత కల్పిస్తున్నామని తెలిపారు. దేశ భద్రత కోసం ప్రాణత్యాగం చేసిన పోలీస్ అమరవీరుల సేవలు, ధైర్యసాహసాలు ఎప్పటికీ స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయని పేర్కొన్నారు. పోలీస్ అమరవీరుల కుటుంబాల త్యాగాలను సమాజం ఎల్లప్పుడూ గుర్తుంచుకోవాలని, వారి కుటుంబాలకు అండగా నిలవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ప్రజల భద్రత కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా విధులు నిర్వర్తిస్తున్న పోలీసు సిబ్బంది సేవలను గౌరవించాలని కుషాయిగూడ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్. లెంకల భాస్కర్ రెడ్డి అన్నారు.. ఘన నివాళులర్పిస్తూ, వారి త్యాగాలు భావితరాలకు స్ఫూర్తిగా నిలవాలని ఆయన ఆకాంక్షించారు. పోలీస్ అమరవీరులకు నివాళులర్పించిన వారిలో కుషాయిగూడ డిఐ వెంకటేశ్వర్లు, ఎస్సైలు నిమ్మ సుధాకర్ రెడ్డి, వెంకన్న, సతీష్, విజయ్ సిబ్బంది, వివిధ రాజకీయ పార్టీల నేతలు పాల్గొని నివాళులర్పించారు.



# మంచిర్యాలలో కొనసాగుతున్న హైటెన్షన్ జగన్మోహన్ రావు ఇంటి వద్ద భారీ బందోబస్తు

**మంచిర్యాల, మహా ప్రతినిధి** : మంచిర్యాల జిల్లాలో కాంగ్రెస్ వర్గపోరు కారణంగా నాలుగు రోజులుగా హైటెన్షన్ వాతావరణం నెలకొంది. దండేపల్లి మండలం తాళ్లపేట గ్రామంలో సద్దుల బతుకమ్మ వేడుకల్లో చెలరేగిన వివాదం కాస్తా జిల్లా కేంద్రాన్ని తాకింది.

మంగళవారం (దసరా రోజు) తాళ్లపేటలో ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు వర్గం, కాంగ్రెస్ నేత మంతెన జగన్మోహన్ రావు వర్గాల మధ్య మరోసారి ఘర్షణ చెలరేగింది. ఆకుల రాజేందర్, సురేష్, విజయ్ తదితరులు ఆకుల రాజేంద్ర ప్రసాద్, అతని మేనల్లుడిపై దాడి చేశారని కేసు నమోదైంది. ఈ దాడిలో ఆరుగురికి గాయాలయ్యాయి. ఈ నేపథ్యంలో బుధవారం మంచిర్యాల బైపాస్ రోడ్డు, గౌతమి నగర్ లోని జగన్మోహన్ రావు నివాసంపై ప్రత్యర్థి వర్గం దాడికి యత్నించే అవకాశం ఉందన్న నిఘా సమాచారంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. రామగుండం పోలీస్ కమిషనర్ ఆదేశాలతో నలుగురు ఇన్స్పెక్టర్లు, ఏసీపీ, పలువురు ఎస్సైలతో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

**అసలు గొడవకు కారణం**

ఆదివారం రాత్రి తాళ్లపేట స్టేజీ వద్ద మహిళలు బతుకమ్మ ఆడుతుండగా ఎమ్మెల్యే వర్గానికి చెందిన ఆకుల దుర్గా ప్రసాద్ వారి సమీపంలో పటాకులు కాల్చడంతో వివాదం మొదలైంది. వారించిన గిరిజన మహిళా సర్పంచ్ కుర్సింగ కళావతిపై దురుసుగా ప్రవర్తించారని ఆరోపణలు వచ్చాయి. పోలీసులు లాఠీచార్జ్ చేయడంతో మహిళలు లక్సెట్టిపేటజన్నారం రోడ్డుపై రాస్తారోకో చేశారు. లక్సెట్టిపేట సీఐ రమణమూర్తిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పండుగ వేళ అధికార పార్టీలోనే ఇరుపక్షాల వర్గపోరుతో మంచిర్యాల ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.



## చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక దసరా..

- ఎల్బీనగర్‌లో దసరా ఉత్సవాల్లో మల్‌రెడ్డి రాంరెడ్డి..
- ప్రజలకు విజయదశమి పండుగ శుభాకాంక్షలు తెలిపారు

**ఎల్బీనగర్ అక్టోబర్ 21 మహా**: చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా, ధర్మం విజయానికి నిదర్శనంగా నిలిచే విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని, ఎల్బీనగర్ నియోజకవర్గ పరిధిలో నిర్వహించిన దసరా ఉత్సవాల్లో తెలంగాణ రాష్ట్ర రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి పాల్గొన్నారు. స్థానిక నాయకులు, ప్రజల ఆహ్వానం మేరకు వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన దసరా వేడుకలకు హాజరైన ఆయన, ప్రజలకు విజయదశమి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ పర్వదినం ప్రతి ఒక్కరి జీవితాల్లో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, శాంతి, సమృద్ధిని తీసుకురావాలని ఆకాంక్షించారు. చెడుపై మంచి, అధర్మంపై ధర్మం సాధించిన విజయాన్ని చాటిచెప్పే విజయదశమి పండుగ ప్రజల్లో ఐక్యత, సోదరభావం, సానుకూల దృక్పథాన్ని పెంపొందించాలని ఆయన ఆకాంక్షించారు. పండుగలను ప్రజలందరూ కలిసి ఆనందోత్సాహాలతో జరుపుకోవడం మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో గజ్జి భాస్కర్ యాదవ్, పన్యాల జైపాల్ రెడ్డి, బబ్బూరి ఆనంద్ గౌడ్, చెన్నగోని రవీందర్ గౌడ్, రాజశేఖర్ తదితర నాయకులు పాల్గొన్నారు.

## కేటీఆర్‌ను కలిసిన బండారి లక్ష్మారెడ్డి

**కుషాయిగూడ,. మహా** : విజయదశమి సందర్భంగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో కారిపే ప్రవీణ్ వంజారి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) ను ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా కేటీఆర్‌కు దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జెర్రిపోతుల ప్రభుదాస్ పాల్గొన్నారు. విజయదశమి పర్వదినం సందర్భంగా ప్రజల జీవితాల్లో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, విజయాలు నిండాలని కారిపే ప్రవీణ్ వంజారి ఆకాంక్షించారు.





## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి...

**రాజేంద్రనగర్ మహా** : దసరా సెలవుబలు ముగించుకొని వస్తూరోడ్డు ప్రమాదంలో తండ్రి చనిపోయిన సంఘటన పెద్ద షాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం జరిగింది. దసరా సెలవులు పూర్తి కావడంతో తన కూతురు దేవి ని నారాయణగూడ నుంచి తండ్రి మన్మరి రవి బైక్ పై తీసుకుని వస్తూ శంషాబాద్ మండలం కాచారంలోని వర్ధమాన ఇంజనీరింగ్ కళాశాల వద్ద రోడ్డు ప్రమాదంలో తండ్రి మృతి చెందాడు. ఎపి 28 డిక్యు 5644 నంబరు గల బైక్‌పై నారాయణగూడ నుండి మద్దూరు గ్రామంలోకి వస్తుండగా మార్గం మధ్యలోని కచారంలోని వర్ధమాన్ ఇంజనీరింగ్ కళాశాల ములమలుపు వద్ద ఎదురుగా వస్తున్న ఆటో ట్రాలీ ని బైక్ ఢీ కొట్టింది. దీంతో మన్మరి రవికి,అతని కూతురు కు తీవ్ర గాయాలకు, ఇద్దరినీ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మన్మరి రవి (39) చనిపోయాడని డాక్టర్లు తెలిపారు. కూతురు దేవి కి ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# సింగరేణి పాఠశాల గ్రౌండ్ నిండా భక్తసందోహం

- రావణ వధకు వేలాదిగా తరలివచ్చిన జనం
- కార్మిక కుటుంబాల కోలాహలం, జంబి ఆకుల అలాయ్ బలాయి
- కార్యక్రమాన్ని విజయవంతం చేసిన సింగరేణి యాజమాన్యం, పోలీస్ శాఖకు సర్వత్రా ప్రశంసలు



**మందమర్రి, మహా**: మంగళవారం విజయదశమి దసరా పండగ పురస్కరించుకొని మందమర్రిలోని సింగరేణి పాఠశాల మైదానం జనసందోహంతో కిటకిటలాడింది. గత కొన్ని సంవత్సరాలుగా మందమర్రి, బెల్లంపల్లి, రామకృష్ణాపూర్ ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్న సింగరేణి కార్మిక, కాంట్రాక్ట్ కార్మిక కుటుంబాలను ఒకే తాటిపైకి తీసుకువచ్చేందుకు యాజమాన్యం చేపట్టిన 'రావణ వధ' కార్యక్రమానికి ఊహించని రీతిలో స్పందన లభించింది. దాదాపు 30 వేల మందికి పైగా ప్రజలు తమ కుటుంబసభ్యులతో కలిసి మైదానానికి తరలిరావడంతో దసరా వేడుకలు అంబరాన్నంటాయి.మైదానానికి విచ్చేసిన కార్మిక కుటుంబాలు ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకుంటూ, జంబి ఆకులతో 'అలాయ్ బలాయి' తీసుకున్నారు. మహిళలు కొత్త దుస్తులు, ఆభరణాల విశేషాలు పంచుకుంటూ, ముచ్చటించుకుంటూ ఉత్సాహంగా గడిపారు.

ఘనంగా సాంస్కృతిక కార్యక్రమాలు – ఆకట్టుకున్న రావణ వధచెన్నూర్ ఎమ్మెల్యే, రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేకానంద, మంత్రి సతీమణి గడ్డం సరోజ, మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, మందమర్రి జీఎం ఎన్ రాధాకృష్ణ, ఏఐటీయూసీ (జేబీసీసీఐ) సభ్యులు వాసిరెడ్డి సీతారామయ్య, మందమర్రి బ్రాంచి కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణల చేతుల మీదుగా ఈ వేడుకలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ప్రధాన వేదికపై ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు, కన్నులపండువగా సాగిన రంగురంగుల విద్యుత్ కాంతులు, భారీ బాణాసంచా పేలుళ్లు సభకు విచ్చేసిన ప్రజలను విశేషంగా ఆకట్టుకున్నాయి. అనంతరం నిర్వహించిన ఆధ్యాత్మిక రావణ వధ ఘట్టం ప్రేక్షకులను అలరించాయి.

సింగరేణి యాజమాన్యం, పోలీస్ శాఖపై ప్రశంసల జల్లు ఈ భారీ వేడుకను సొంత ఖర్చులతో, ఎంతో బాధ్యతాయుతంగా నిర్వహించి కార్మిక కుటుంబాల మధ్య ఐక్యతను చాటిన సింగరేణి యాజమాన్యానికి కార్మికులు, కార్మిక నేతలు, ప్రజలు హర్షధ్వానాలతో ధన్యవాదాలు తెలిపారు.అలాగే, వేలాదిగా తరలివచ్చిన జనాన్ని క్రమబద్ధీకరించేందుకు పటిష్టమైన బారికేడ్లు ఏర్పాటు చేయడమే కాకుండా, మైదానంలో దొంగతనాలు, ఇతర అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా బందోబస్తు నిర్వహించిన పోలీస్ విభాగానికి ప్రత్యేక అభినందనలు వెల్లువెత్తాయి. గ్రౌండ్ అంతటా పోలీస్ సిబ్బందిని మోహరించి ఎలాంటి అసౌకర్యం కలగకుండా శాంతిభద్రతలను కాపాడిన తీరుపై కార్మిక లోకం బెల్లంపల్లి ఏసీపీ, మందమర్రి సిఐ పర్స రమేష్, పట్టణ ఎస్సై గోపతి నరేష్‌లకు ప్రశంసల వర్షం కురిపించారు. ఈ కార్యక్రమంలో సింగరేణి గుర్తింపు సంఘం ఏఐటీయూసీ కేంద్ర కమిటీ ఉపాధ్యక్షులు భీమనాథుని సుదర్శన్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు మంద తిరుమల్ రెడ్డి, కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి

పుల్లూరి లక్ష్మణ్, మాజీ పట్టణ అధ్యక్షులు నోముల ఉపేందర్ గౌడ్, సొత్కు సుదర్శన్ తదితరులు ఉన్నారు. అంతకుముందు శ్రీ వెంకటేశ్వర ఆలయంలో విజయదశమి సందర్భంగా దుర్గా మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించి పల్లకి సేవలో మంత్రి బృందం పాల్గొంది.

# బెల్లంపల్లిలో వైభవోపేతంగా రావణాసుర వధ కార్యక్రమం

- ముఖ్యఅతిథులుగా హాజరైన రాష్ట్ర కార్మిక శాఖ మాత్యులు గడ్డం వివేక్ సరోజన దంపతుల తో పాటు స్థానిక ఎమ్మెల్యే గడ్డం వినోద్

**బెల్లంపల్లి, మహా**: బెల్లంపల్లి పట్టణంలో దసరా పండుగ ను పురస్కరించుకొని తిలక్ స్టేడియం లో హిందూ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన రావణాసుర వధ కార్యక్రమం దసరా సందర్భంగా ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన రాష్ట్ర కార్మిక శాఖ మాత్యులు గడ్డం వివేక్ సరోజన దంపతులతో పాటు బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్, మాజీ ఎమ్మెల్యేలు దుర్గం చిన్నయ్య, అమరాజుల శ్రీదేవి మున్సిపల్ చైర్ పర్సన్ దావస్వాతి రమేష్ బాబు వైస్ చైర్మన్ రాగం శెట్టి సత్యనారాయణ బెల్లంపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రత్నం సుకుమారి, రాష్ట్ర టీపిసీసీ కన్వీనర్ స్వామి పిసిసి మెంబర్ చిలుమల శంకర్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు బండి ప్రభాకర్ యాదవ్ లు హాజరయ్యారు. దసరా వేడుకల సందర్భంగా హిందూ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన రావణాసుర వద కార్యక్రమం తిలక్ స్టేడియంలో హిందూ ఉత్సవ కమిటీ నిర్వహించగా నియోజకవర్గంలోని పలు మండలాలతో పాటు పట్టణంలోని ప్రజలు వేలాదిగా తరలివచ్చారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్మిక శాఖ మాత్యులు గడ్డం వివేక్ మాట్లాడుతూ చెడుపై మంచి కోసం చేసిన పోరాటంలో విజయం వరించిన సందర్భంగా విజయదశమిని పండుగలు నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తుందని అదేవిధంగా రాష్ట్రంలో ప్రజా పాలన కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాటినుండి ప్రజా సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తుందని, పలుపథకాలను ప్రవేశపెట్టి ప్రజల అభిమానం సంపాదించడం జరిగిందని పేర్కొన్నారు. విదేశాలలో ఉద్యోగ ఉపాధి అవకాశాల కోసం రాష్ట్ర ప్రభుత్వం నర్సింగ్ విద్యను అభ్యసించిన వారికి ఉపాధి కల్పించే దిశగా జర్మన్ భాషను నేర్పించడం జరుగుతుందని మందమరి పట్టణంలో మొదటి బ్యాచ్ ఎంపిక జరిగి భాష పై పట్టు సాధించే క్రమంలో నిపుణులను ఏర్పాటు చేయడం జరిగిందని ,బెల్లంపల్లి నియోజకవర్గంలోనూ సంబంధిత కార్యక్రమాన్ని విస్తరిస్తామని ఆయన పేర్కొన్నారు. అనంతరం బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ మాట్లాడుతూ హిందూ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో రావణాసుర వాద కార్యక్రమం నిర్వహించి పట్టణ ప్రజలతో పాటు నియోజకవర్గ ప్రజలందరూ ఒకే చోటకు చేర్చిన కమిటీ సభ్యులను మనస్ఫూర్తిగా ఆయన అభినందించారు .బెల్లంపల్లి పట్టణ ప్రజలకు దసరా శుభాకాంక్షలు తెలిపి ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని దుర్గాదేవి కరుణాకటాక్షాలు అందరికీ దక్కాలని ఆయన మనసారా ఆకాంక్షించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆధ్వర్యంలో పేదలకు బడుగు బలహీన వర్గాలకు రాష్ట్ర ప్రభుత్వం అనేక పథకాలను ప్రవేశపెట్టిందని వెల్లడించారు. అనంతరం రావణాసుర వధ కార్యక్రమాన్ని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక ఆధ్వర్యంలో నిర్వహించగా పెద్ద పెద్ద ఎత్తున బాణాసంచా టపాకాయలు పేల్చి కార్యక్రమం ముగింపు దశకు చేర్చారు. రావణాసుర వధ కార్యక్రమాన్ని విజయవంతంvగా నిర్వహించేందుకు పట్టణ పోలీసులు బెల్లంపల్లి ఏసిపి కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో వన్ టౌన్ సిఐ శ్రీనివాసరావు, సిఐ హనుక్ లు పటిష్ట బందోబస్తు నిర్వహించి ట్రాఫిక్ ను నియంత్రించారు.

## దర్గాగా ప్రభుత్వ భూములు కబ్జాయత్నం

**పట్టించుకోని అధికారులు**

**రాజేంద్రనగర్ మహా** ; శంషాబాద్ మండల పరిధిలోని అమ్మపల్లి రెవెన్యూ సర్వేనెంబర్ 19 లో , సయ్యద్ గూడా రెవెన్యూ సర్వేనెంబర్ 25 లో ( 14.20 ఎకరాలు,) ప్రభుత్వ భూముల ఆక్రమణలు జోరుగా కొనసాగుతుంది. నిషేధిత జాబితాలో ఉన్న సర్ప్లస్ సీలింగ్ భూములను కొంతమంది అక్రమార్కులు అదేపనిగా కబ్జా చేస్తున్నారు. తాజాగా శంషాబాద్ షాబాద్ ప్రధాన రహదారి పద్మావతి ఫంక్షన్ హాల్ ఎదురుగా సర్వేనెంబర్ 19 లో గొల్లపల్లి నుంచి పెద్ద గోల్కొండ వెళ్తున్న రోడ్డుకు ఉన్న ప్రభుత్వ భూమి కబ్జాకుయత్నాలు మొదలయ్యాయి. అక్కడ ప్రభుత్వ భూమిలో నిర్మించిన అనధికార వెంచర్ ప్రహరీ గోడ ముందు భాగంలో కబ్జా ప్రయత్నాలు జరుగుతున్నాయి. అక్కడ గుర్తు తెలియని వ్యక్తులు ఆ భూమిలో మట్టి కుప్పలు పోసి, కొంత భాగం ఇప్పటికే చదును చేశారు. మరోపక్క ఏకంగా ఫెన్సింగ్ వేశారు. అధికారులు చూసి చూడనట్లుగా ఉండడంతో రాత్రికి రాత్రి మట్టితో పూడ్చి నిర్మాణాలు చేపట్టి వ్యాపారాలు చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు వెంటనే చర్యలు తీసుకొని ప్రభుత్వ భూములను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.



# కంది శ్రీనివాస రెడ్డి క్యాంపు కార్యాలయంలో చేరికల సందడి

- కాంగ్రెస్ లో భారీ చేరికలు
- కంది శ్రీనివాస రెడ్డి సమక్షంలో జాయినింగ్స్
- కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానంచిన కంది శ్రీనివాస రెడ్డి దంపతులు

**ఆదిలాబాద్ మహా**: ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంఛార్జి కంది శ్రీనివాస రెడ్డి క్యాంప్ కార్యాలయం చేరికలతో సందడిగా మారింది. బుధవారం మాజీవైస్ యంపీపీ బండి సుదర్శన్ ,బాది శ్రీనన్న ,సర్పంచ్ వినోద్ ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో బాది గ్రామ పంచాయతీ పరిధిలోని మల్కగూడ గ్రామస్తులు కాంగ్రెస్ పార్టీలో చేరారు.వారందరికి కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు కంది శ్రీనివాస రెడ్డి దంపతులు . రోజురోజుకు చేరికలతో పార్టీ బలోపేతమవుతుందని తనను నమ్ముకుని పార్టీలోకి వచ్చిన వారికి ఎల్లవేళలా తాను అండగా ఉంటానని కంది శ్రీనివాస రెడ్డి అన్నారు. వచ్చే ఎన్నికలేవైనా అంతా కలిసి పార్టీ గెలుపు కోసం పని చేద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ గిమ్మ సంతోష్ రావు, కౌన్సిలర్లు స్వాతి మంగేష్, అన్నపూర్ణ,మహబూబ్ ,పర్వేజ్ , నాయకులు బండారి సతీష్ , బూర్ల శంకరయ్య, సుధాకర్ గౌడ్, శాంతన్ రావు, గుడిపల్లి నగేష్ ,కొండ గంగాధర్ , మునిగెల విఠల్ ,ఎల్టి భోజారెడ్డి ,సాహిద్ అలీ, రాజారెడ్డి ,భూపల్లి శ్రీధర్, వెంకటి యాదవ్,అల్చెట్టి నాగన్న,అచ్యుత్ , రాంరెడ్డి, సంటెన్న,అతిక్ , సోనియా మంథని, జుబేదా, జమునాబాయి, రూపారోజ్లిన్ పాల్గొన్నారు.



# హస్నాపూర్ దసరా వేడుకలలో కంది శ్రీనివాస రెడ్డి దంపతులు

- కుటుంబ సభ్యులు, గ్రామస్తులతో కలిసి సందడి
- శారదాదేవి మండపాల వద్ద పూజలు
- బతుకమ్మల చుట్టూ నృత్యాలు
- గ్రామస్తులకు విజయదశమి శుభాకాంక్షలు తెలిపిన కంది శ్రీనివాస రెడ్డి కుటుంబ సభ్యులు

**ఆదిలాబాద్ మహా** : విజయదశమి పండగను పురస్కరించుకొని ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి తన సతీమణి కంది మౌనా శ్రీనివాస రెడ్డి తో కలిసి స్వగ్రామం హస్నాపూర్ గ్రామాన్ని సందర్శించారు. తన నివాసంలో తల్లిదండ్రులు కంది అనసూయా కిష్టారెడ్డి లకు శమీ పత్రి అందచేసి పాదాభివందనం చేసి ఆశీస్సులు అందుకున్నారు. అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి గ్రామంలోని శారదాదేవి మండపాలను సందర్శించి అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు . మండపాల ఆవరణలో నిర్వహించిన బతుకమ్మ వేడుకలలో పాల్గొన్నారు. గ్రామస్తులతో కలిసి కంది శ్రీనివాస రెడ్డి కుటుంబ సభ్యులంతా బతుకమ్మల చుట్టూ ఉత్సాహంగా బతుకమ్మ పాటలకు అనుగుణంగా నృత్యాలు చేసారు. హస్నాపూర్ గ్రామస్తులందరికి పండగ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం గ్రామస్తులు బంగారం శమీ పత్రి అందచేసి కంది శ్రీనివాస రెడ్డి కుటుంబ సభ్యులకు దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కంది శ్రీనివాస రెడ్డి కుటుంబ సభ్యులతో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.



# ఈటలకు శుభాకాంక్షలు తెలిపిన కొత్త అశోక్ గౌడ్..

- దసరా శుభాకాంక్షలుతో ఆత్మీయ కలయిక..
- జగన్మాత ఆశీస్సులతో అందరూ సంతోషంగా ఉండాలి
- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొత్త అశోక్ గౌడ్

**ఇబ్రహీంపట్నం అక్టోబర్ 21 మహా:** విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకొని, మల్కాజ్ గిరి పార్లమెంట్ సభ్యులు, ఈటల రాజేందర్ ను కలిసిన, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొత్త అశోక్ గౌడ్ దసరా పండుగ శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. ఈ సందర్భంగా పరస్పర ఆత్మీయతతో, ఆనందోత్సాహాల మధ్య జరిగిన ఈ కలయిక ఎంతో ప్రత్యేకంగా నిలిచింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక విజయదశమి. ఆ జగన్మాత ఆశీస్సులతో అందరి జీవితాల్లో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, విజయాలు వెల్లివిరియాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు కొత్త అశోక్ గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, మధు, మోహన్, సాయి తదితరులు పాల్గొన్నారు.

# లాడ్జిలో ఉరి వేసుకుని యువకుడి ఆత్మహత్య

**కుషాయిగూడ, మహా :** లాడ్జిలో యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... కర్నూలుకు చెందిన అనుపట్ల వీరేష్ ఆటో డ్రైవర్ గా జీవనోపాధి పొందుతూ కుటుంబంతో కలిసి మధురానగర్ వాయుపురి కాలనీలో నివసిస్తున్నారు. ఇతని కుమారుడు అనుపట్ల కిరణ్ (21) డ్రైవర్ కం డెలివరీ బాయ్ గా పనిచేస్తున్నాడు. అయితే అనుపట్ల కిరణ్ ఈనెల 18వ తేదీన కమలానగర్ లోని ఆర్ 2 ఓయో లాడ్జిలోని 401 రూమ్ లో బస చేశాడు. మరుసటి రోజు 19వ తేదీన రూమ్ క్లీనర్ తలుపు కొట్టిన తీయలేదు. అనుమానంతో మరో మాస్టర్ కి తో తలుపు తెరిచి చూడగా రూమ్ లోని సీలింగ్ ఫ్యాన్ కు ఉరివేసుకొని వేలాడుతూ కనిపించాడు. దీంతో లాడ్జి యాజమాన్యం పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు వచ్చి మృతుడి వివరాలను సేకరించారు. ఈ క్రమంలో మృతుడి తండ్రికి విషయాన్ని తెలియజేశారు. కాగా కిరణ్ రెండు నెలల క్రితం ప్రేమ వివాహం చేసుకొని ఇంటికి రాగా ఇంట్లోకి అనుమతించలేదు. దీంతో కిరణ్ తన భార్యతో కలిసి వేరే చోట నివసిస్తున్నారు. ఈ క్రమంలో కిరణ్ ఆర్థిక సమస్యలు లేక ప్రేమ వివాహంతో ఏర్పడిన పరిస్థితుల కారణంగా మనస్థాపం చెంది ఆత్మహత్య చేసుకుని ఉంటాడని పోలీసులు, కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు మృతుని తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.





# చెడుపై మంచి సాధించిన విజయమే దసరా

- సనాతన హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో దసరా వేడుకలు
- ముఖ్య అతిథులుగా హాజరైన కంది శ్రీనివాస రెడ్డి దంపతులు
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు
- సనాతన హిందూ ఉత్సవ సమితి సేవలను కొనియాడిన అతిథులు
- ఆధ్యాత్మిక స్పీచ్ తో ఆకట్టుకున్న కంది శ్రీనివాస రెడ్డి
- అవసరమయిన సమయాలలో అమ్మాయిలు కాళికామాత లుగా మారాలన్న కంది మౌనా శ్రీనివాస రెడ్డి
- శమీ చెట్టుకు పూజలు చేసిన కంది శ్రీనివాస రెడ్డి దంపతులు
- రావణుడు బొమ్మకు నిప్పు పెట్టి దహనం
- ప్రజలకు విజదశమి దీపావళి శుభాకాంక్షలు తెలిపిన కంది శ్రీనివాస రెడ్డి దంపతులు



ఆదిలాబాద్ మహా : చెడుపై మంచి సాధించిన విజయమే విజయదశమి అని ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి అన్నారు. మంగళవారం పండగను పుస్కరించుకొని సనాతన హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో స్థానిక డైట్ కళాశాల మైదానంలో నిర్వహించిన దసరా వేడుకలకు ఆయన తన సతీమణి కంది మౌనా శ్రీనివాస రెడ్డితో కలిసి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సమితి సభ్యులు వారిని ఘనంగా స్వాగతించి శాలువాలతో సత్కరించారు.వరంగల్ క్రాంతి ఆర్కెస్ట్రా జానపద భక్తి పాటలు ,సాంస్కృతిక నృత్యాలు ఆహుతులను అలరించాయి. ఈ సందర్భంగా కంది శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ ..శ్రీ రాముడు రావణుడిని సంహరించి అతని చెర నుండి సీతమ్మ ను విడిపించిన ఇదే రోజునని అలాగే దుర్గమ్మ తొమ్మిది రోజుల యుద్ధంలో మహిషారుడిని మర్దించిన రోజు , పాండవులు షమీ చెట్టు నుండి తమ అస్త్రాలు తిరిగి తీసుకున్నది కూడా దసరా రోజునేనని అన్నారు. చెడుపై మంచి కి ప్రతీక అయిన విజయ దశమి రోజున అందరూ ఓ గొప్ప మంచి నిర్ణయం తీసుకొని సన్మార్గంలో పయనిస్తే అనుకున్న పనులలో విజయం సాధిస్తారన్నారు. పిల్లలను మంచిగా చదివిస్తామని అందరు గట్టిగా పంకల్పించుకోలన్నారు. తాను అమెరికా నుండి వచ్చింది ఆదిలాబాద్ ప్రజల సేవ కోసమే అన్నారు. ఆదిలాబాద్ సమగ్ర అభివృద్ధే తన ధ్యేయమన్నారు. తాను సంపాదించిన ఆస్తిలో సగం ఆదిలాబాద్ ప్రజల కోసమే ఖర్చు పెడతానని అన్నారు. ఆయన ఆధ్యాత్మిక ప్రసంగానికి ప్రజలనుండి చప్పట్ల రూపంలో మంచి స్పందన వచ్చింది.అటు అమ్మాయిలను కుమారులతో సమానంగా తల్లిదండ్రులు బాగా చదివించాలని కంది మౌనా శ్రీనివాస రెడ్డి పిలుపునిచ్చారు.ఆపద సమయాలలో యువతులు మహిళలు భయపడకుండా పరిస్థితులను ధైర్యంగా ఎదుర్కోవాలన్నారు. అవసరమయిన సమయాలలో కాళికామాతలుగా మారాలని సూచించారు. దంపతులిద్దరు ప్రజలకు దసరా దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. వేద పండితులు శాస్త్రోక్త మంత్రాల మధ్య కంది శ్రీనివాస రెడ్డి దంపతులు శమీ చెట్టుకు పూజలు నిర్వహించారు. అనంతరం రావణదహన కార్యక్రమానికి హాజరై నిప్పు పెట్టి రావణుడిని దహనం చేసారు. బాణసంచా మెరుపుల మధ్య రావణుడు తగలబడిపోతున్న దృశ్యాలను ప్రజలు తమ మొబైల్ లో రికార్డ్ చేసుకుని మురిసిపోయారు. ఈ కార్యక్రమంలో మాజీ ఫ్లోర్ లీడర్ బండారి సతీష్, వైద్యులు వెంకటరెడ్డి, వేద పండితులు సంతోష్ శర్మ,సనాతన హిందూ ఉత్సవ సమితి అధ్యక్షులు ప్రమోద్ ఖత్రి, గౌరవ అధ్యక్షులు కందుల రవీందర్, ప్రధాన కార్యదర్శి రేణికుంట రవీందర్, కోశాధికారి సంతోష్ అగర్వాల్,కార్యనిర్వాహక అధ్యక్షులు దశరథ్ , ఉపాధ్యక్షులు సమనపల్లి నర్సింలు , సురేష్ పొడవాల్ , మహిపాల్ , సుభాష్ ఉరడే ,తిరుపతి రెడ్డి, విజయ్ తదితరులు పాల్గొన్నారు

# సీయంఆర్ ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన కంది శ్రీనివాస రెడ్డి



**ఆదిలాబాద్** : పేద బడుగు బలహీన వర్గాల సంక్షేం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి అన్నారు. పేదల వైద్యఖర్చుల నిమిత్తం ముఖ్య మంత్రి సహాయ నిధినుండి వచ్చిన చెక్కులను ఆయన బుధవారం తన క్యాంపు కార్యాలయంలో లబ్దిదారులకు అందించారు. మొత్తం 13లక్షల 60వేల రూపాయల విలువ గల 26 చెక్కులు పంపిణీ చేసారు.సీయంఆర్ ఎఫ్ సహాయం కోసం తన క్యాంపు కార్యాలయం లో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసామని ఆసుపత్రుల్లో డబ్బుల పెట్టి వైద్యం చేయించుకున్నవారికి ముఖ్య మంత్రి సహాయ నిధినుండి ఆర్థిక సాయంకోసం దరఖాస్తు పెట్టుకో వచ్చన్నారు. ఇంకా 23లక్షల 50వేల విలువ గల చెక్కులు పెండింగ్ లో ఉన్నాయని త్వరలో పంపిణీ చేస్తామన్నారు. ఇప్పటివరకు తన క్యాంపు కార్యాలయం ద్వారా 4కోట్ల 18లక్షల రూపాయల విలువ గల చెక్కులు పంపిణీ చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ గిమ్మ సంతోష్ రావు, కౌన్సిలర్లు స్వాతి మంగేష్, అన్నపూర్ణ,మహబూబ్ ,పర్వేజ్ , నాయకులు బండారి సతీష్ , బూర్ల శంకరయ్య, సుధాకర్ గౌడ్, శాంతన్ రావు, గుడిపల్లి నగేష్ ,కొండ గంగాధర్ , మునిగెల విఠల్ ,ఎల్టి భోజారెడ్డి ,సాహిద్ అలీ, రాజారెడ్డి ,భూపల్లి శ్రీధర్, వెంకటి యాదవ్,అల్చెట్టి నాగన్న,అచ్యుత్ , రాంరెడ్డి, సంటెన్న,అతిక్ , సోనియా మంథని, జుబేదా, జమునాబాయి, రూపారోజ్లిన్ తదితరులు పాల్గొన్నారు.



# సమాచార హక్కు వికాస సమితిలో చేరిన దాసరి నీలేశ్, రసభత్తుల వేణు

**మంచిర్యాల, మహా ప్రతినిధి :** సమాచార హక్కు చట్టంపై ప్రజల్లో అవగాహన కల్పించి, ప్రభుత్వ కార్యాలయాల్లో పారదర్శకత పెంపొందించే లక్ష్యంతో సమాచార హక్కు వికాస సమితి ఆధ్వర్యంలో మంచిర్యాల జిల్లాలో సభ్యత్వ నమోదు కార్యక్రమం కొనసాగుతోంది. ఇందులో భాగంగా మంచిర్యాల జిల్లా కార్యవర్గ సభ్యులు కాసర్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో దాసరి నీలేశ్, సింగరేణి ఫోర్‌మెన్ రసభత్తుల వేణులకు ఉచిత సభ్యత్వాలు అందజేశారు. వారికి గుర్తింపు కార్డులను కాసర్ల శ్రీనివాస్ అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం సామాన్యుడి చేతిలో శక్తివంతమైన ఆయుధమన్నారు. ప్రభుత్వ సేవల్లో పారదర్శకత పెంచడానికి, ప్రజా సమస్యల పరిష్కారానికి ఈ చట్టం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ప్రతి ఒక్కరూ చట్టంపై అవగాహన పెంచుకొని తమ హక్కులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమితి ద్వారా ఉచిత సభ్యత్వాలు, అవగాహన, శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. సభ్యత్వం పొందిన అనంతరం దాసరి నీలేశ్, రసభత్తుల వేణులు మాట్లాడుతూ సమాజానికి ఉపయోగపడే సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పించేందుకు తమ వంతు కృషి చేస్తామని వారు వెల్లడించారు.

# ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ను కలిసి దసరా శుభాకాంక్షలు తెలిపిన మాజీ జడ్పిటిసి దంపతులు

**రాజేంద్రనగర్ మహా** ; శంషాబాద్ మండలం మాజీ జెడ్పిటిసి నిరటి తన్విరాజ్ ముదిరాజ్ దంపతులు మైలార్దోపల్లి డివిజన్ పరిధిలోని ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ నివసంలో బుధవారం అయిననూ కలిసి దసరా శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత మైన పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు.బ



# కాంగ్రెస్ లో ఉంటే మంచి భవిష్యత్తు

- పార్టీ ని బలోపేతం చేసుకుందాం
- రాష్ట్రంలో కేంద్రం లో కాంగ్రెస్ ప్రభుత్వమొచ్చేలా కృషి
- కంది శ్రీనివాస రెడ్డి క్యాంపు కార్యాలయంలో ఆత్మీయ సమ్మేళనం
- హాజరైన కంది శ్రీ స రెడ్డి దంపతులు
- పెద్ద సంఖ్యలో హాజరైన నాయకులు కార్యకర్తలు
- ప్రత్యక్ష రాజకీయాలలోకి కంది మౌనా శ్రీనివాస రెడ్డి
- దీవెనలు కావాలని విజ్ఞప్తి



**ఆదిలాబాద్ మహా** : పార్టీని నమ్ముకొని పని చేసే వారికి కాంగ్రెస్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని అనవసరంగా ఎవరు పార్టీ మారకూడదని ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి సూచించారు. బుధవారం పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో జరిగిన ముఖ్య నాయకులు ఆత్మీయ సమ్మేళనంలో ఆయన తన సతీమణి కంది మౌనా శ్రీనివాస రెడ్డితో కలిసి హాజరయ్యారు. పార్టీని నమ్ముకుని ఉన్నవారికి తగిన న్యాయం జరుగుతుందని ఆయన భరోసానిచ్చారు. కాంగ్రెస్ పార్టీ లో మంచి భవిష్యత్తు ఉంటుందని అన్నారు. ఇందిరమ్మ ఇండ్లు కాంగ్రెస్ పార్టీ ఇచ్చినవే అన్నారు. ఇందులో బీజేపీకి ఎలాంటి క్రెడిట్ లేదన్నారు. ఇందిరమ్మ ఇండ్ల బిల్లులు త్వరగా మంజూరుకావాలంటే ప్రభుత్వ నియమాల ప్రకారం మూడు రంగుల జెండా రంగులు వేయాలన్నారు. స్థానిక ఎమ్మెల్యే పాయల్ శంకర్ తనే ఎయిర్ పోర్ట్ తీసుకువచ్చినా అని గొప్పలు చెప్పుకుంటున్నారని విమర్శించారు. ఇందిరమ్మ ఇండ్లు కూడా తనే ఇస్తున్నట్టు ప్రచారం చేసుకుంటున్నారని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల లో కేంద్రానివి ఒక్క రూపాయి కూడా లేదన్నారు. గ్రామాలలో వార్డులలో ఇందిరమ్మ ఇండ్లు వచ్చినవారికి ఆయా పార్టీ శ్రేణులు మిఠాయి ప్యాకెట్ ఇచ్చి శుభాకాంక్షలు తెలపాలని కోరారు. స్థానిక ఎమ్మెల్యే పై ప్రజలలో విముఖత ఏర్పడిందని ఆయన ప్రజలకోసం చేసిందేమీ లేదన్నారు. ఇప్పటికిప్పుడు వెన్నికలు జరిగితే ఆయన ఘోర ఓటమి తప్పదన్నారు. పేదలెవరికైన ఇండ్లు రాకపోతే జాబితా తయారు చేసి సిద్ధంగా ఉంచాలని వారికి ఇండ్లు వచ్చేలా కృషి చేస్తానన్నారు.తన సతీమణి మౌనా శ్రీనివాస రెడ్డి ప్రత్యక్ష రాజకీయాలలోకి వస్తుందని మీ ఈందరి ఆశీర్వాదం ఆమెకు కావాలని కోరారు. తనను నమ్ముకుని పనిచేసే కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని తెలిపారు. పార్టీ గెలుపు కోసం అందరి సహకారం కావాలన్నారు. కార్యకర్తలే పార్టీకి ముఖ్యమన్నారు. మరోమారు రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం అటు కేంద్రంలో రాహుల్ గాంధీ ప్రధాని అయ్యేలా కలిసికట్టుగా పని చేద్దామని పిలుపనిచ్చారు. అందరికి దసరా దీపావళి బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు. తను భర్త అడుగు జాడలలో నడుస్తూ ప్రత్యక్ష రాజకీయాలలోకి అడుగు పెడుతున్నానని అందరి సహకరించాలని కంది శ్రీనివాస రెడ్డి సతీమణి కంది మైనా శ్రీనివాస రెడ్డి కోరారు. ఇప్పుడిప్పుడే అన్నీ నేర్చుకుంటున్నానని తెయనివి ఏవైనా ఉంటే నేర్పితే తప్పకుండా నేర్చుకుంటానన్నారు. ప్రతీ ఒక్కరు సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉండాలన్నారు. ప్రభుత్వ పథకాలను విస్తృతంగా ప్రచారం చెయ్యాలని సూచించారు. మనం చేసే పని అందరికీ తెలిసేలా ప్రచారం చెయ్యాలన్నారు. శ్రద్ధతో పని చేస్తే తప్పకుండా గుర్తింపు వస్తుందన్నారు. రెండేళ్లు నిరంతరంగా కష్టపడితే గెలుపు మనదేన్నారు. కొత్తగా రాజకీయాల్లోకి వస్తున్న తనకు ప్రజల దీవెనలు కావాలని కోరారు. రేవంత్ రెడ్డి ని మరోమారు ముఖ్యమంత్రిగా రాహూల్ గాంధీ ని ప్రధానిగా చేసేంతవరకు కష్టపడి పని చేద్దామన్నారు. అనంతరం పలువురికి ఇందిరమ్మ ప్రొసీడింగ్ కాపీలు అందచేసారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ గిమ్మ సంతోష్ రావు, కౌన్సిలర్లు స్వాతి మంగేష్, అన్నపూర్ణ,మహబూబ్ ,పర్వేజ్ , నాయకులు బండారి సతీష్ , బూర్ల శంకరయ్య, సుధాకర్ గౌడ్, శాంతన్ రావు, గుడిపల్లి నగేష్ ,కొండ గంగాధర్ , మునిగెల విఠల్ ,ఎల్టి భోజారెడ్డి ,సాహిద్ అలీ, రాజారెడ్డి ,భూపల్లి శ్రీధర్, వెంకటి యాదవ్,అల్చెట్టి నాగన్న,అచ్యుత్ , రాంరెడ్డి, సంటెన్న,అతిక్ , సోనియా మంథని, జుబేదా, జమునాబాయి, రూపారోజ్లిన్ , వివిధ గ్రామాల సర్పంచులు ఉప సర్పంచులు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, అనుబంధ సంఘాల అధ్యక్షులు ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ పై ఎంపీ యుద్ధం

- యార్డ్ తరలింపే లక్ష్యంగా మల్కాజిగిరి ఎంపీ ఈటల పాదయాత్ర .

**జవహర్ నగర్, మహా** : గరీబోళ్లకు అడ్డ ఈ జవహర్ నగర్ గడ్డయేనని, కాలుష్య కాసారంగా ప్రపంచంలోనే నాలుగవ స్థానంలో జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ ఉన్నదని మల్కాజిగిరి ఎంపీ ఈటెల రాజేందర్ పేర్కొన్నారు. డంపింగ్ యార్డ్ ను ఎత్తివేయాలని కోరుతూ ఈనెల 27 నుండి పాదయాత్ర చేపట్టనున్నట్లు ఎంపీ ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన పార్టీ శ్రేణులతో కలిసి మీడియాతో మాట్లాడుతూ దేశంలో ఉన్న గరీబోళ్లు జీవించే అడ్డ జవహర్ నగర్ అని అలాంటి జవహర్ నగర్ నేడు డంపింగ్ యార్డు వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. డంపింగ్ యార్డ్ వల్ల చుట్టుపక్కల ప్రాంతాలైన కీసర, దమ్మాయిగూడ, నాగారం, అహ్మద్ గూడ, ఘట్కేసర్ తదితర ప్రాంతాల్లో జీవవైవిద్య సమస్యలు ఉత్పన్నమయ్యాయని పేర్కొన్నారు. ఈ డంపింగ్ యార్డ్ వలన పశుపక్షాదుల ఉనికికే ప్రమాదకరమైందన్నారు. భూగర్భ జలాలు కలుషితమైపోయాయని, జవహర్ నగర్ చుట్టుపక్కల ప్రజల జీవితం అగమ్య గోచరంగా తయారైందని తెలిపారు. గతంలో ఎంపీగా పని చేసిన రేవంత్ రెడ్డి ఈ సమస్య గురించి అప్పట్లో తీవ్రంగా ప్రతిఘటించాడని, కానీ నేడు ముఖ్యమంత్రి అయ్యాక ఈ సమస్యను మరిచిపోవడం బాధాకరమన్నారు. డంపింగ్ యార్డ్ వల్ల పరిసర ప్రాంతాలు గాలి నీరు వాయువులు కలుషితమైపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యను నిరసిస్తూ ఈ నెల 23వ తేదీన బాధితులతో ఈ నెల 25వ తేదీన మేధావులతో డంపింగ్ యార్డ్ సమస్యలపై సమావేశం నిర్వహించి అనంతరం పాదయాత్రను ప్రారంభిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో జవహర్ నగర్ బిజెపి పార్టీ నాయకులు కలికోట కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.




# పోలీసు అమరవీరుల త్యాగాలు మరువలేనివి

- ప్రజల రక్షణలో పోలీసుల సేవలు అభినందనీయం
- లైన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ కళ్లెం కృష్ణారెడ్డి...

**కుషాయిగూడ, మహా** : విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన పోలీసు అమరవీరుల త్యాగాలు ఎన్నటికీ మరువలేనివని లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ జిల్లా 320సి గవర్నర్ కళ్లెం కృష్ణారెడ్డి అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ జిల్లా 320సి ఆధ్వర్యంలో కుషాయిగూడ పోలీసులను సన్మానించే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళ్లెం కృష్ణారెడ్డి మాట్లాడుతూ. దేశ ప్రజల భద్రత కోసం పోలీసులు నిరంతరం విధులు నిర్వహిస్తున్నారని, శాంతిభద్రతల పరిరక్షణలో వారి పాత్ర కీలకమని అన్నారు. పోలీసుల సేవలను సమాజం గుర్తించి గౌరవించాలని సూచించారు. ఇన్స్పెక్టర్ లెంకల. భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ.. పోలీసు సిబ్బంది సేవలను గుర్తించి సన్మానించిన లయన్స్ క్లబ్ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. సమాజ సేవలో లయన్స్ క్లబ్ నిర్వహిస్తున్న కార్యక్రమాలు అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో క్రైమ్ ఇన్స్పెక్టర్, చర్లపల్లి ఇన్చార్జి ఎస్ హెచ్ ఓ వెంకటేశ్వర్లు గౌడ్, ఎస్ఐలు వెంకన్న, సాయిలు, విజయ్, సతీష్ లయన్స్ క్లబ్ జిల్లా 320సి ప్రతినిధులు, మాజీ కార్పొరేటర్ పావని రెడ్డి, కొత్త రామారావు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొత్త అంజిరెడ్డి, లక్ష్మీమూర్తి, జ్యోతిర్మయి చారి, నాగన్న, దత్తు, పెద్ది నాగరాజు, కృష్ణవేణి, రాఘవరెడ్డి, కలకొండ భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.



# సర్వ మానవ సోదర భావానికి ప్రతీక విజయదశమి.

- మాజీ మేయర్ శాంతి కొటేష్ గౌడ్.

**జవహర్ నగర్, మహా** : సర్వ మానవ సౌభ్రాతృత్వానికి, సోదర భావానికి ప్రతికే విజయదశమి అని జవహర్ నగర్ మాజీ మేయర్ శాంతి కోటేష్ గౌడ్ పేర్కొన్నారు. బోడుప్పల్ లో కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ జిల్లా అధ్యక్షులు మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్ ను కలిసి పుష్పగుచ్చం అందించి దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్ రెడ్డిని కలిసి దసరా శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా శాంతి కోటేష్ గౌడ్ మాట్లాడుతూ ఆయురారోగ్యాలు సుఖసంతోషాలతో వజ్రేష్ యాదవ్ ప్రజా సేవలో ఉన్నత స్థానానికి ఎదగాలని కాంగ్రెస్ పార్టీ బలోపితానికి ఆయన చేస్తున్న కృషి మరింత విజయవంతం కావాలని తెలిపారు. దసరా పండుగ చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక అని ఈ పర్వదినం ప్రతి ఒక్కరి జీవితాల్లో కొత్త ఆశలు సంతోషాలు విజయాలు నింపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జవహర్ నగర్ పార్టీ జనరల్ సెక్రటరీ ఎర్ర గుడ్ల వెంకటేశ్వర్లు, మాజీ కార్పొరేటర్ ప్రేమల శ్రీనివాస్, సీనియర్ నాయకులు బల్లి శ్రీనివాస్ గుప్తా, విజయరాయి, వీర్ల భుజంగం, ఆకుల ప్రభాకర్ గౌడ్, నాగేష్, కృష్ణ గౌడ్, రఫీ, జాన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం

- ప్రజల రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణే పోలీసుల ప్రధాన లక్ష్యం
- సీపీ అంబర్ కిషోర్ ఝా
- శాంతిభద్రతలతోనే సమాజ అభివృద్ధి సాధ్యం
- కలెక్టర్ కుమార్ దీపక్



**పెద్దపల్లి మహా** : రామగుండం: దేశ ప్రజల రక్షణ కోసం విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీసు అమరవీరుల త్యాగాలు ఎప్పటికీ చిరస్మరణీయమని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, ఐపీఎస్ అన్నారు. ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణతో పాటు శాంతిభద్రతలను పరిరక్షించడమే పోలీసుల ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలోని అమరవీరుల స్థూపం వద్ద బుధవారం పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గత ఏడాది నుంచి ఇప్పటివరకు దేశవ్యాప్తంగా విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన 154 మంది పోలీసు అమరవీరుల పేర్లను అడిషనల్ డీసీపీ (అడ్మిన్) శ్రీనివాస్ చదివి వినిపించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, పెద్దపల్లి డీసీపీ బి. రామ్ రెడ్డి, ఆర్జీ1 జీఎం లలిత్ కుమార్, ఇతర పోలీసు అధికారులు, అమరవీరుల కుటుంబ సభ్యులు అమరవీరుల స్థూపం వద్ద పుష్పగుచ్చాలు ఉంచి నివాళులర్పించారు. అనంతరం ఆర్ఐ శేఖర్ ఆధ్వర్యంలో సాయుధ పోలీసులు శోకశస్త్రం నిర్వహించారు. పోలీసు అధికారులు, సిబ్బంది, అమరవీరుల కుబటుంబ సభ్యులు రెండు నిమిషాలు మౌనం పాటించి అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీ అంబర్ కిషోర్ ఝా మాట్లాడుతూ.. పోలీసు చరిత్రలో అక్టోబర్ 21వ తేదీకి ప్రత్యేక ప్రాధాన్యత ఉంబదన్నారు. 1959 అక్టోబర్ 21న లడఖ్ లోని హాట్ స్ప్రింగ్స్ ప్రాంతంలో సరిహద్దు పర్యవేక్షణ విధులు నిర్వహిస్తున్న భారతీయ పోలీసు బృందంపై చైనా బలగాలు దాడి చేయగా, మన జవాన్లు ధైర్యంగా పోరాడి ప్రాణత్యాగం చేశారని తెలిపారు. వారి త్యాగాలకు గుర్తుగా ప్రతి సంవత్సరం అక్టోబర్ 21న పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని వివరించారు. దేశ రక్షణ, ప్రజల భద్రత కోసం ప్రాణాలు అర్పించిన పోలీసు సిబ్బంది, ఇతర భద్రతా బలగాల త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని అన్నారు. అమరవీరుల పేర్లను స్మరించుకోవడమే కాకుండా, వారు ఏ లక్ష్యం కోసం ప్రాణత్యాగం చేశారో గుర్తుంచుకుని అదే స్ఫూర్తితో విధులు నిర్వర్తించాలని సూచించారు. ప్రజల ప్రాణాలు, ఆస్తులను రక్షించడం, శాంతిభద్రతలను కాపాడటం, అంతర్గత భద్రతను పరిరక్షించడం పోలీసు శాఖ ప్రధాన బాధ్యతలని తెలిపారు. ఎలాంటి క్లిష్ట పరిస్థితులు ఎదురైనా ప్రజలకు రక్షణ కల్పించడంలో పోలీసులు ముందుండాలని, ప్రతి అధికారి, సిబ్బంది తమకు అప్పగించిన బాధ్యతలను నిబద్ధత, నిజాయితీ, అంకితభావంతో నిర్వర్తించాలని సూచించారు. పోలీసు శాఖపై ప్రజలకు ఉన్న నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ క్రమశిక్షణ, బాధ్యత, సేవాభావంతో విధులు కొనసాగించాలని పేర్కొన్నారు. అమరవీరులు చూపిన ధైర్యం, త్యాగం, దేశభక్తి ప్రతి పోలీసు అధికారి, సిబ్బందికి నిరంతరం స్ఫూర్తినివ్వాలని అన్నారు. దేశ రక్షణ, ప్రజల భద్రత కోసం ప్రాణాలు అర్పించిన పోలీసు అమరవీరులందరికీ హృదయపూర్వక నివాళులర్పిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ.. విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీసు అమరవీరులను స్మరించుకోవడం, వారి సేవలు, త్యాగాలను గుర్తుచేసుకోవడం కోసం ప్రతి సంవత్సరం పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. దేశ సరిహద్దులను విదేశీ దురాక్రమణల నుంచి రక్షించే బాధ్యతను సైన్యం, నౌకాదళం, వాయుసేన నిర్వహిస్తుండగా, దేశ అంతర్గత భద్రత, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసు శాఖ కీలక పాత్ర పోషిస్తోందని అన్నారు. రాష్ట్ర పోలీసు బలగాలతో పాటు రిజర్వ్ పోలీసు, పారామిలటరీ బలగాలు కూడా అంతర్గత భద్రతలో ముఖ్యమైన బాధ్యతలను నిర్వహిస్తున్నాయని వివరించారు. దేశ సరిహద్దుల రక్షణ ఎంత ముఖ్యమో, అంతర్గతంగా తలెత్తే వివాదాలు, అసాంఘిక కార్యకలాపాల నుంచి ప్రజలను రక్షించడం కూడా అంతే ముఖ్యమని పేర్కొన్నారు. సమాజంలో శాంతి, సామరస్యం నెలకొన్నప్పుడే సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు.

పోలీసుల విధులు అత్యంత బాధ్యతాయుతమైనవని, వారు 24 గంటలు, ఏడాదిలో 365 రోజులు ప్రజల రక్షణ కోసం నిరంతరం పనిచేస్తారని తెలిపారు. ఈ క్రమంలో కొందరు పోలీసులు తమ ప్రాణాలను సైతం త్యాగం చేస్తున్నారని, వారి సేవలను, త్యాగాలను ప్రతి ఒక్కరూ గౌరవించాలని కోరారు. పోలీసు శాఖకు సహకరించాలనుకునే ప్రతి పౌరుడు చట్టాలను గౌరవించి, నిబంధనలను పాటించాలని, ముఖ్యంగా ట్రాఫిక్ నిబంధనలను ఖచ్చితంగా అనుసరించాలని సూచించారు. నిబంధనలు ప్రజలను భయపెట్టడానికి కాకుండా వారి భద్రత, సమాజ శ్రేయస్సు కోసం రూపొందించబడ్డాయని కలెక్టర్ తెలిపారు

# అమరవీరుల కుటుంబాలకు అండగా ఉంటాం

- పోలీస్ అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం..
- వారి సేవలు భావితరాలకు స్ఫూర్తిదాయకం
- కలెక్టర్ చిత్రా మిశ్రా, సీపీ గౌష్ ఆలం



**కరీంనగర్ మహా** : ప్రజల ప్రాణ, ఆస్తుల రక్షణతో పాటు శాంతిభద్రతల పరిరక్షణ కోసం విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీస్ అమరవీరుల త్యాగాలు వెలకట్టలేనివని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం పేర్కొన్నారు. ప్రజల భద్రత కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా విధులు నిర్వర్తించిన పోలీస్ అమరవీరుల సేవలు ఎప్పటికీ చిరస్మరణీయమని కొనియాడారు.పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా బుధవారం కరీంనగర్ పోలీస్ కమిషనరేట్‌లోని అమరవీరుల స్తూపం వద్ద కలెక్టర్ చిత్రా మిశ్రా, సీపీ గౌష్ ఆలం పుష్పగుచ్ఛాలు ఉంచి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం అదనపు డీసీపీ వెంకటరమణ విధి నిర్వహణలో దేశవ్యాప్తంగా ప్రాణత్యాగం చేసిన పోలీస్ అమరవీరుల పేర్లను చదివి వినిపించారు. అమరవీరులకు గౌరవ వందనం సమర్పించి వారి త్యాగాలను స్మరించుకున్నారు.

**శాంతిభద్రతలే అభివృద్ధికి పునాది**

ఈ సందర్భంగా కలెక్టర్ చిత్రా మిశ్రా మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా శాంతిభద్రతల పరిరక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన పోలీస్ అమరవీరుల సేవలను స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతని అన్నారు. జిల్లా యంత్రాంగానికి పోలీస్ శాఖ వెన్నెముక వంటిదని, శాంతిభద్రతలు పటిష్ఠంగా ఉన్నప్పుడే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయడం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. అమరవీరుల కుటుంబాలకు, ముఖ్యంగా వారి పిల్లల విద్యాభివృద్ధి, సంక్షేమానికి జిల్లా యంత్రాంగం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

**ప్రజాసేవలోనే అమరవీరులకు నిజమైన నివాళి**

పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం మాట్లాడుతూ, దేశ సమగ్రత, అంతర్గత భద్రత, ప్రజల రక్షణ కోసం పోలీసులు నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన అమరవీరుల త్యాగాలు ప్రతి పోలీస్ అధికారి, సిబ్బందికి స్ఫూర్తిదాయకమని అన్నారు. అమరవీరుల ఆశయాలకు అనుగుణంగా ప్రజలకు అంకితభావంతో సేవలందించడం, శాంతిభద్రతలను కాపాడటం ద్వారానే వారికి నిజమైన నివాళి అర్పించినట్లవుతుందని పేర్కొన్నారు. అమరవీరుల కుటుంబాలకు ప్రభుత్వం, పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటాయని స్పష్టం చేశారు.

**అమరవీరుల కుటుంబాలకు భరోసా**

అనంతరం అమరవీరుల కుటుంబ సభ్యులతో అధికారులు మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నుంచి అందాల్సిన నష్టపరిహారాలు, ఇతర ప్రయోజనాలు పూర్తిస్థాయిలో అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

**31 వరకు సంస్మరణ వారోత్సవాలు**

పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా అక్టోబర్ 21 నుంచి 31 వరకు కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పలు కార్యక్రమాలు నిర్వహించనున్నారు. రక్తదాన శిబిరాలు, ఓపెన్ హౌస్ కార్యక్రమాలు, వ్యాసరచన, లఘుచిత్రాల పోటీలు నిర్వహించడంతో పాటు విద్యార్థులు, యువతకు పోలీసుల సేవలు, విధులు, బాధ్యతలపై అవగాహన కల్పించనున్నారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ వెంకటరమణ, ఏసీపీలు, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది, అమరవీరుల కుటుంబ సభ్యులు పాల్గొని పోలీస్ అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు.

# సింగరేణి కార్మికుల సంక్షేమమే ప్రభు త్వ ధ్యేయం..

- సింగరేణి అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది..
- కార్మికులకు లాభాల బోనస్, అధికారులకు వేతనాల పెంపుతో దసరా కానుక..
- విజయదశమి వేడుకల్లో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు
- మణుగూరులో ఘనంగా దసరా ఉత్సవాలు..
- పోలీస్‌స్టేషన్‌లో ఆయుధపూజ



**మణుగూరు, మహా** : సింగరేణి సంస్థ అభివృద్ధితో పాటు కార్మికులు, అధికారుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని మణుగూరులో సింగరేణి ఆధ్వర్యంలో దసరా వేడుకలను ఘనంగా నిర్వహించారు. భద్రాద్రి స్టేడియంలో నిర్వహించిన వేడుకలకు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయనకు సింగరేణి ఏరియా జీఎం దుర్గం రామచందర్, ఏజీయం పర్సనల్ రమేష్, ఏరియా అధికారులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సింగరేణి అభివృద్ధిలో కార్మికుల కృషి వెలకట్టలేనిదని, వారి శ్రమకు తగిన గుర్తింపు, ఆర్థిక భద్రత కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. కార్మికులకు లాభాల బోనస్, దసరా కానుకగా అధికారులకు కోల్ ఇండియా తరహాలో వేతనాల పెంపు వంటి సంక్షేమ చర్యలకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు. సింగరేణి సంస్థను మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తూ కార్మిక కుటుంబాల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. కార్మికులు, అధికారులు, వారి కుటుంబ సభ్యులకు విజయదశమి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఏరియా దుర్గం రామచందర్ మాట్లాడుతూ ముందుగా కార్మికులకు కార్మిక కుటుంబ సభ్యులకు విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. సంస్థ అభివృద్ధికి కార్మికులు అధికారులు కార్మిక సంఘం నేతలు సమైక్యంగా స్థానిక ప్రజాప్రతినిధులను వినియోగించుకొని కృషి చేయాలన్నారు. యంత్రాల పని సామర్థ్యాన్ని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకొని లక్ష్యానికి అనుగుణంగా ఉత్పత్తి సాధించాలని అన్నారు. విజయదశమి వేడుకలను తిలకించేందుకు సింగరేణి కార్మికులు, వారి కుటుంబ సభ్యులు, కార్మిక సంఘాల నాయకులు, పరిసర ప్రాంతాల ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చారు. భద్రాద్రి స్టేడియంలో దసరా ఉత్సవాల సందర్భంగా సందడి నెలకొంది. కార్యక్రమంలో ఏరియా జీఎం రామచందర్, ఎంజీఎం రమేష్, సింగరేణి అధికారులు, కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

**పోలీస్‌స్టేషన్‌లో ఘనంగా ఆయుధపూజ**

విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని మణుగూరు పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆయుధపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసు ఆయుధాలకు సంప్రదాయబద్ధంగా పూజలు చేశారు. డీఎస్పీ రవీందర్‌రెడ్డి పోలీసు అధికారులు, సిబ్బందికి విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సీఐ నాగబాబు, ఎస్సైలు నగేష్‌కుమార్, రవుఫ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. మరోవైపు సింగరేణి భద్రాద్రి స్టేడియంలో నిర్వహించిన విజయదశమి వేడుకల సందర్భంగా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. సీఐ నాగబాబు, ఎస్సైలు నగేష్‌కుమార్, రవుఫ్ భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు. పెద్దసంఖ్యలో ప్రజలు తరలివచ్చిన నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహించారు.



# పెద్దంపేట లో వైభవంగా దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాల ముగింపు

**భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు.. అంగరంగ వైభవంతో ఊరేగింపు**

పెద్దపల్లి మహా : పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం పెద్దంపేట్ గ్రామంలో దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలు బుధవారం భక్తిశ్రద్ధల నడుమ వైభవంగా ముగిశాయి. నవరాత్రి ఉత్సవాల సందర్భంగా గ్రామంలో వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించడంతో పాటు దుర్గాదేవికి ప్రత్యేక పూజలు, అర్చనలు చేపట్టారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులు భక్తిపారవశ్యంతో పూజలు నిర్వహించారు.ఉత్సవాల ముగింపు సందర్భంగా మంగళవాయిద్యాలు, భక్తుల జయ జయధ్వానాల నడుమ అమ్మవారిని గ్రామంలోని ప్రధాన వీధులతో పాటు అన్ని వీధుల్లో అంగరంగ వైభవంగా ఊరేగించారు. అమ్మవారి ఊరేగింపులో గ్రామస్తులు, మహిళలు, యువకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తిని చాటుకున్నారు. దీంతో గ్రామంలో ఎటు చూసినా ఆధ్యాత్మిక సందడి నెలకొని పండుగ వాతావరణం వెల్లివిరిసింది.అనంతరం సంప్రదాయబద్ధంగా అమ్మవారి నిమజ్జన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నవరాత్రి ఉత్సవాలు విజయవంతంగా ముగియడంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు. దుర్గాదేవి కృపాకటాక్షాలతో గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని భక్తులు ప్రార్థించారు.



# పట్టభద్రులు ఎమ్మెల్సీ ఓటు నమోదు చేసుకోండి

**నవంబరు 6 తుది గడువు**

**సత్తుపల్లి, అక్టోబర్ 21: మహా** : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటు నమోదుకు అర్హులైన ప్రతి ఒక్కరూ నవంబరు 6లోగా దరఖాస్తు చేసుకోవాలని ఇస్లామిక్ మోటివేషనల్ స్పీకర్ బ్రదర్ షఫీ సూచించారు. ఆన్‌లైన్‌లో సులభంగా దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని, అవసరమైన ధ్రువపత్రాలను సిద్ధం చేసుకుని ప్రక్రియను పూర్తి చేయాలని కోరారు. సత్తుపల్లి పట్టణంలోని జామే మసీదు ప్రాంగణంలో మంగళవారం నిర్వహించిన ఆధ్యాత్మిక కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. 2023 అక్టోబరు 31 నాటికి డిగ్రీ లేదా తత్సమాన విద్యార్హత పొంది, సంబంధిత నియోజకవర్గంలో సాధారణ నివాసిగా ఉన్న అర్హులు ఓటు నమోదుకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

**ఆన్‌లైన్‌లో దరఖాస్తు విధానం ఇలా..**

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటు నమోదుకు తెలంగాణ ప్రధాన ఎన్నికల అధికారి అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించాలని బ్రదర్ షఫీ సూచించారు. పట్టభద్రుల ఓటరు నమోదు కోసం నిర్దేశించిన నమూనా 18 దరఖాస్తును ఎంచుకుని, దానిలో అడిగిన వ్యక్తిగత వివరాలు, విద్యార్హత, చిరునామా తదితర సమాచారాన్ని నమోదు చేయాలని తెలిపారు. దరఖాస్తుతో పాటు డిగ్రీ ధ్రువపత్రం, తాత్కాలిక పట్టా, మార్కుల మెమో వంటి విద్యార్హత ఆధారాలను సిద్ధం చేసుకోవాలని తెలిపారు. అవసరమైన వివరాలను నమోదు చేసి దరఖాస్తును సమర్పించాలని సూచించారు.

**పాత ఓటర్లు సైతం కొత్తగా నమోదు చేసుకోవాలి**

గతంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు జాబితాలో పేరు ఉండి, ఎన్నికల్లో ఓటు వేసినవారు కూడా ఈసారి కొత్తగా దరఖాస్తు చేసుకోవాలని బ్రదర్ షఫీ తెలిపారు. పాత జాబితాలో పేరు ఉన్నంత మాత్రాన కొత్త జాబితాలోనూ పేరు ఉంటుందని భావించకూడదన్నారు. అర్హులైన మహిళలు, పురుషులు అందరూ ఈ విషయాన్ని గుర్తించి గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. దరఖాస్తుల స్వీకరణకు నవంబరు 6 చివరి తేదీ కావడంతో చివరి రోజు వరకు వేచి చూడకుండా ముందుగానే ప్రక్రియను పూర్తి చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి జామే మసీదు కమిటీ అధ్యక్షుడు షేక్ నాయబ్ రసూల్, కార్యదర్శి ఎండీ కమల్ పాషా, ఉపాధ్యక్షుడు షేక్ యూసఫ్, మజీద్, నాగుల్ మీరా, షేక్ ఇబ్రహీం వలీ, షేక్ బుడెన్ తదితరులు పాల్గొన్నారు.



# ఆడబిడ్డలకు దసరా కానుకగా చీరల పంపిణీ

- గంగారంలో బతుకమ్మ వేడుకలు... పాల్గొన్న ప్రజాప్రతినిధులు
- దాసరి కుటుంబ సేవలను ప్రశం-సించిన ఎమ్మెల్యే రాగమయి

**సత్తుపల్లి, మహా** : దసరా పండుగను పురస్కరించుకొని గంగారం గ్రామంలో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో మహిళలకు చీరలు పంపిణీ చేశారు. గ్రామ యువజన కాంగ్రెస్ నాయకుడు దాసరి మధుమోహన్‌రెడ్డి దాతృత్వంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. దాసరి వెంకటరామిరెడ్డి (చిట్టినాయన), రాజకుమారి దంపతుల ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలకు సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. మహిళలు సంప్రదాయబద్ధంగా బతుకమ్మలను పేర్చి, ఆటపాటలతో పండుగ సంబరాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాగమయి దయానంద్ మాట్లాడుతూ గంగారం గ్రామ అభివృద్ధికి దాసరి కుటుంబం చేస్తున్న కృషిని అభినందించారు. పండుగ వేళ మహిళలకు చీరలు పంపిణీ చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. గ్రామాభివృద్ధితో పాటు సామాజిక సేవా కార్యక్రమాలకు ప్రాధాన్యమివ్వడం స్ఫూర్తిదాయకమన్నారు. అనంతరం ఎమ్మెల్యే రాగమయి దయానంద్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ దయానంద్ విజయకుమార్, గ్రామ యువజన కాంగ్రెస్ నాయకుడు దాసరి మధు మోహన్ రెడ్డిని గ్రామస్తులు శాలువాలతో సత్కరించి, పుష్పగుచ్ఛాలు అందజేశారు. కార్యక్రమంలో గ్రామ మహిళలు, స్థానిక నాయకులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



# మార్కెట్ కమిటీ నూతన చైర్మన్ తోలెం కళ్యాణికి ఎమ్మెల్యే పాయం సన్మానం..

**రైతుల సంక్షేమానికి ప్రాధాన్యమివ్వాలని సూచన..**

**మణుగూరు, మహా** : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన చైర్మన్‌గా నియమితులైన తోలెం కళ్యాణి బుధవారం మణుగూరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పినపాక ఎమ్మెల్యే, ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ పాయం వెంకటేశ్వర్లును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కళ్యాణిని ఎమ్మెల్యే శాలువాతో సత్కరించి అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ, వారికి మెరుగైన మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. రైతుల సంక్షేమమే లక్ష్యంగా మార్కెట్ కమిటీని అభివృద్ధి పథంలో నడిపించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మత సామరస్యానికి ప్రతీకగా ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ సేవలు..

- దసరా వేడుకల్లో ఉచితంగా టీ, బిస్కెట్ల పంపిణీ..
- సేవలను అభినందించిన అధికారులు కార్మిక నేతలు..



**మణుగూరు, మహా** : మతాలు వేరైనా మానవత్వం ఒక్కటేనని చాటిచెబుతూ సింగరేణి ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ చేపడుతున్న సేవా కార్యక్రమాలు మత సామరస్యానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని ఏరియా టీబీజీకేఎస్ వైస్ ప్రెసిడెంట్ నాగెల్లి కొనియాడారు. దసరా పండుగ సందర్భంగా మంగళవారం పీవీ కాలనీలోని భద్రాద్రి స్టేడియంలో నిర్వహించిన వేడుకలకు తరలివచ్చిన వేలాది మందికి మణుగూరు ఏరియా సింగరేణి ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచితంగా టీ, బిస్కెట్లు పంపిణీ చేశారు. ఈ సేవా స్టాల్‌ను ఏరియా జనరల్ మేనేజర్ దుర్గం రామచందర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా అధికారులు, కార్మిక సంఘ నేతలు మాట్లాడుతూ సింగరేణి కార్మికులు, వారి కుటుంబ సభ్యులు, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులు, ప్రాజెక్టు ప్రభావిత ప్రాంతాల ప్రజలతో పాటు పట్టణ పరిసర ప్రాంతాల నుంచి వచ్చిన వేలాది మందికి ఎలాంటి భేదభావాలు లేకుండా సేవలందించడం అభినందనీయమన్నారు. గత పదేళ్లకు పైగా దసరా వేడుకల్లో ఈ సేవా కార్యక్రమాన్ని నిరంతరాయంగా కొనసాగించడం అసోసియేషన్ సభ్యుల సేవాభావానికి నిదర్శనమన్నారు. గంటల తరబడి శ్రమిస్తూ, సొంత ఖర్చులతో ప్రజలకు టీ, బిస్కెట్లు అందించడం ప్రశంసనీయమని పేర్కొన్నారు. పండుగలు వేరైనా ప్రజల మధ్య ప్రేమాభిమానాలు, సోదరభావం ఒక్కటేనన్న సందేశాన్ని ఆచరణలో చూపుతున్నారని అభినందించారు. అసోసియేషన్ అధ్యక్షుడు అబ్దుల్ రవూఫ్‌తో పాటు కమిటీ సభ్యులందరికీ ప్రత్యేక అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో సింగరేణి ఏరియా అధికారులు, వివిధ కార్మిక సంఘాల నాయకులు, పోలీసు శాఖ ప్రతినిధులు, ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

# పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం

- ప్రజల రక్షణకు పోలీసులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలి
- 15వ బెటాలియన్ కమాండెంట్ ఎన్.పెద్దబాబు



**సత్తుపల్లి, మహా** : దేశ రక్షణ, సమాజ శాంతిభద్రతల పరిరక్షణలో ప్రాణాలర్పించిన పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని 15వ ప్రత్యేక పోలీసు బెటాలియన్ కమాండెంట్ ఎన్.పెద్దబాబు అన్నారు బ. బుధవారం బి.గంగారంలోని బెటాలియన్ ప్రాంగణంలో పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా అమరవీరుల స్మారక స్థూపం వద్ద ఆయన పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. అనంతరం స్మృతి పరేడ్ ద్వారా గౌరవ వందనం సమర్పించారు. ఈ సందర్భంగా పెద్దబాబు మాట్లాడుతూ దేశంలోని వివిధ ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తూ దేశం, సమాజం కోసం ప్రాణత్యాగం చేసిన పోలీసు అమరవీరుల సేవలను స్మరించుకోవడం మన బాధ్యతని పేర్కొన్నారు. వారి త్యాగాలకు గుర్తుగా ఏటా అక్టోబరు 21న సంస్మరణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సంఘ విద్రోహ శక్తులను ఎదుర్కొంటూ ప్రజల ప్రాణ, ఆస్తుల రక్షణకు పోలీసులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బెటాలియన్ అదనపు కమాండెంట్ ఏ.అంజయ్య, సహాయ కమాండెంట్ బి.వినాయక రావు, అధికారులు, పోలీసు సిబ్బంది, హోంగార్డులు పాల్గొన్నారు.

# అమరవీరుల త్యాగాలే పోలీస్ శాఖకు స్ఫూర్తి

- జిల్లా ఎస్పీ రోహిత్ రాజు
- పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం



**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** అమరవీరుల త్యాగాలే పోలీస్ శాఖకు స్ఫూర్తి అని భద్రాద్రి జిల్లా ఎస్పీ రోహిత్ రాజు అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా జిల్లా ఎస్పీ రోహిత్ రాజు అమరవీరుల స్తూపం వద్ద విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీస్ అమరవీరులకు పుష్పగుచ్ఛాలు సమర్పించి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం సాయుధ పోలీసులు "శోక్ శస్త్ర" నిర్వహించి అమరవీరులకు గౌరవ వందనం సమర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణ కోసం నిరంతరం కృషి చేస్తూ విధి నిర్వహణలో ప్రాణాలను త్యాగం చేసిన పోలీస్ అమరవీరుల సేవలు త్యాగాలు ఎప్పటికీ మరువలేనివని పేర్కొన్నారు. వారి త్యాగాలు ప్రతి పోలీస్ అధికారి సిబ్బందికి స్ఫూర్తిదాయకమని తెలిపారు.1959 అక్టోబర్ 21న లడఖ్‌లోని హాట్ స్ప్రింగ్స్ ప్రాంతంలో చైనా సైన్యంతో జరిగిన పోరాటంలో ప్రాణాలు కోల్పోయిన పది మంది పోలీస్ సిబ్బంది త్యాగాలకు గుర్తుగా 1962 సంవత్సరం నుండి ప్రతి సంవత్సరం అక్టోబర్ 21న దేశవ్యాప్తంగా పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని వివరించారు. 2025 సెప్టెంబర్ 1 నుంచి 2026 ఆగస్టు 31 వరకు దేశవ్యాప్తంగా విధి నిర్వహణలో వీరమరణం పొందిన 154 మంది పోలీస్ సిబ్బందిని ఈ సందర్భంగా స్మరించుకోవడం మనందరి బాధ్యత అని తెలిపారు. వీరిలో తెలంగాణ రాష్ట్రానికి చెందిన నలుగురు పోలీస్ సిబ్బంది ఉన్నారని పేర్కొన్నారు. దేశ భద్రత అంతర్గత భద్రత శాంతిభద్రతల పరిరక్షణ నేరాల నియంత్రణలో పోలీస్ శాఖ కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు. ఉగ్రవాదం, నక్సలిజం వంటి సవాళ్లను ఎదుర్కొంటూ ప్రజలకు రక్షణ కల్పించేందుకు పోలీసులు నిరంతరం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రజలకు ప్రశాంతమైన వాతావరణాన్ని కల్పించేందుకు ప్రాణాలను సైతం లెక్కచేయకుండా విధులు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బంది సేవలు అభినందనీయమని అన్నారు. అమరవీరుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకొని ప్రతి పోలీస్ అధికారి సిబ్బంది అంకితభావంతో విధులు నిర్వహిస్తూ ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో కొత్తగూడెం డీఎస్పీ ఆదినారాయణ, పాల్వంచ డీఎస్పీ ఆర్ సతీష్‌కుమార్, ఇల్లందు డీఎస్పీ వెంకన్న బాబు, మణుగూరు డీఎస్పీ రవీందర్ రెడ్డి, డిసిఆర్బి డీఎస్పీ మల్లయ్య స్వామి, భద్రాచలం డీఎస్పీ అరుణ్ కుమార్, ఏఆర్ డీఎస్పీ సత్యనారాయణ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ మంజ్య నాయక్, జిల్లా పోలీస్ అధికారులు, సిబ్బంది, జిల్లా పోలీస్ కార్యాలయ సిబ్బంది పాల్గొని అమరవీరుల స్థూపం వద్ద విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీస్ అమరవీరులకు నివాళులర్పించారు.




# పేదలకు అందుబాటు ధరల్లో వైద్యం అందాలి

- సహస్ర ఆసుపత్రి ప్రారంభోత్సవం-లో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**సత్తుపల్లి, క్టోబర్ 21**: మహా : ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందుబాటు ధరల్లో లభించినప్పుడే వైద్య రంగానికి సార్థకత చేకూరుతుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. సత్తుపల్లిలో విజయదశమి పర్వదినం సందర్భంగా నూతనంగా ఏర్పాటు చేసిన సహస్ర మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిని స్థానిక ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. వైద్య సేవలకు సత్తుపల్లి ప్రజలు దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితులు తగ్గాలన్నారు. స్థానికంగానే మెరుగైన వైద్య సదుపాయాలు అందుబాటులోకి వస్తే రోగులకు, వారి కుటుంబ సభ్యులకు సమయం, ప్రయాణ ఖర్చులు ఆదా అవుతాయని పేర్కొన్నారు. ప్రైవేటు వైద్య సంస్థలు ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని నాణ్యమైన చికిత్సను సామాన్యులకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. సత్తుపల్లి ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో సహస్ర ఆసుపత్రిని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఆధునిక వైద్య సదుపాయాలను ప్రజలకు చేరువ చేస్తూ, వైద్య సేవల్లో నాణ్యతకు ప్రాధాన్యమివ్వాలని ఆకాంక్షించారు.

**తక్కువ ఖర్చుతో మెరుగైన వైద్యం**

సహస్ర ఆసుపత్రిలో తక్కువ ఖర్చుతో నాణ్యమైన వైద్య సేవలు అందించి సత్తుపల్లి ప్రజల మన్ననలు పొందుతామని ఆసుపత్రి వైద్యులు గోగినేని వినీష్ కృష్ణ తెలిపారు. రోగుల అవసరాలకు అనుగుణంగా మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు మట్టా దయానంద్ విజయకుమార్, ఆసుపత్రి యాజమాన్యం, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# బ్లూ ఇండియా పార్టీ ఫౌండర్ లింగన్న ఆత్మీయ పర్యటన...

**కారేపల్లి,మహా**:విజయదశమి పండుగ సందర్భంగా బ్లూ ఇండియా పార్టీ ఫౌండర్, జాతీయ వైస్ ప్రెసిడెంట్ మరియు జాతీయ ప్రధాన కార్యదర్శి, డోర్నకల్ నియోజకవర్గ ఇంచార్జ్ బానోత్ లింగన్న ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు.సింగరేణి మండలం భాగ్యనగర్ తండా, సామ్య తండాకు చెందిన వాంకుడోత్ నరేష్, మహేష్ కుటుంబ సభ్యులను ఆయన కలిసి విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. కుటుంబ సభ్యులతో కలిసి ఆత్మీయంగా మాట్లాడారు.ఈ కార్యక్రమంలో ఉపేందర్, హరి కుమార్, రవికుమార్, నరేష్, బాలు, శేఖర్, బోడా శివ తదితరులు పాల్గొన్నారు .

# దైవ దర్శనానికి వెళ్లగా... ఇల్లు గుల్ల భారీగా చోరీ

**కుషాయిగూడ, మహా :** ఇంటికి తాళం వేసి దైవదర్శనానికి వెళ్ళగా గుర్తుతెలియని వ్యక్తులు ఇల్లు గుల్ల చేసిన ఘటన కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం... డాక్టర్ ఏఎస్ రావు నగర్ రుక్మిణి పురి కాలనీలో నివసించే ఎన్. మదన్ రాజు (47) ప్రైవేటు ఉద్యోగి. ఈనెల 19వ తేదీన ఉదయం ఇంటికి తాళం వేసి తన కుటుంబ సభ్యులతో కలిసి దైవదర్శనానికి బాసరకు వెళ్లాడు. తిరిగి 20వ తేదీన మధ్యాహ్నం రెండు గంటలకు ఇంటికి రాగా ఇంటి గుమ్మాలు తెరిచి ఉన్నాయి. అనుమానించి లోపలికి వెళ్లి చూడగా బీరువాలో దాచిన సుమారు 371.5 గ్రాముల బంగారం, 300 గ్రాముల వెండి కనిపించలేదు. దీంతో కుషాయిగూడ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



# మణుగూరులో అంబరాన్నంటిన దసరా సంబురాలు

- భక్తులు, కార్మిక కుటుంబాలతో కిక్కిరిసిన భద్రాద్రి స్టేడియం..
- రావణ దహనాన్ని తిలకించేందుకు తరలివచ్చిన ప్రజలు
- సింగరేణి అభివృద్ధికి కార్మికులే వెన్నెముక
- ఎమ్మెల్యే పాయం..
- ఉత్పత్తి లక్ష్యాల సాధనకు సమష్టిగా కృషి చేద్దాం..
- ఏరియా జీఎం దుర్గం రామచందర్

**మణుగూరు, మహా** : విజయదశమి వేడుకలతో మణుగూరు పట్టణంలో పండుగ సందడి నెలకొంది. పీవీ కాలనీలోని భద్రాద్రి స్టేడియం భక్తులు, సింగరేణి కార్మికులు, వారి కుటుంబ సభ్యులు, పట్టణ ప్రజలతో కళకళలాడింది. మంగళవారం సింగరేణి మణుగూరు ఏరియా ఫైన్ ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన దసరా వేడుకలు అంగరంగ వైభవంగా సాగాయి. రావణ దహనాన్ని తిలకించేందుకు ప్రజలు పెద్దఎత్తున తరలిరావడంతో స్టేడియం సందడిగా మారింది. వేడుకల్లో పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా, ఏరియా జనరల్ మేనేజర్ దుర్గం రామచందర్, సేవ అధ్యక్షురాలు దుర్గం సుమతి పాల్గొన్నారు. జీఎం దంపతులు శమీ పూజలో పాల్గొన్నారు. అనంతరం సింగరేణి ముస్లిం ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఏర్పాటు చేసిన ఉచిత టీ, బిస్కెట్ల పంపిణీ స్టాల్‌ను ప్రారంభించారు.బ

**- సింగరేణి అభివృద్ధిలో కార్మికులదే కీలకపాత్ర.. : ఎమ్మెల్యే పాయం***

ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఆర్థిక ప్రగతిలో సింగరేణి సంస్థ కీలకపాత్ర పోషిస్తోందన్నారు. కార్మికులు, అధికారులు, ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులు, వారి కుటుంబ సభ్యులకు విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. సంస్థ లాభాల్లో 34 శాతం వాటా కింద సుమారు రూ.596 కోట్లు కార్మికులకు అందించడం, రెగ్యులర్ ఉద్యోగులకు రూ.1,53,912 చొప్పున బోనస్, కాంట్రాక్టు కార్మికులకు రూ.5,500 చొప్పున చెల్లించడం అభినందనీయమన్నారు. సింగరేణి సామాజిక బాధ్యత నిధుల కింద రూ.25 కోట్లతో కమ్యూనిటీ హాళ్లు, రహదారులు, డ్రైనేజీలు, విద్యాసంస్థలకు ఫర్నిచర్, ఆర్వో నీటి ప్లాంట్లు, బోరు బావులు వంటి అభివృద్ధి పనులు చేపట్టడం ప్రశంసనీయమన్నారు. యువతకు నైపుణ్య శిక్షణతో ఉపాధి అవకాశాలు కల్పించాలని, అర్హులైన డిపెండెంట్లకు ఉద్యోగ నియామక ప్రక్రియను వేగవంతం చేయాలని ఆకాంక్షించారు. సింగరేణి అభివృద్ధికి ప్రభుత్వం అండగా ఉంటుందని పేర్కొన్నారు.

**-ఉత్పత్తి లక్ష్యాల సాధనకు సమష్టి కృషి: జీఎం రామచందర్**

మణుగూరు ఏరియా జనరల్ మేనేజర్ దుర్గం రామచందర్ మాట్లాడుతూ సంస్థ అభివృద్ధిలో కార్మికుల కృషి ఎంతో విలువైనదన్నారు. 2026-27 ఆర్థిక సంవత్సరానికి మణుగూరు ఏరియాకు నిర్దేశించిన 121.26 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని భద్రతకు అత్యంత ప్రాధాన్యమిస్తూ సాధించేందుకు ప్రతి ఒక్కరూ సమష్టిగా కృషి చేయాలని కోరారు. బొగ్గు నాణ్యత, ఉత్పాదకత, రవాణా, యంత్రాల సమర్థ నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామన్నారు. సంస్థ సీఎండీ డాక్టర్ ఎన్. బలరామ్ మార్గదర్శకత్వంలో మణుగూరు ఏరియా ఉత్పత్తి లక్ష్యాల సాధనలో ముందుకు సాగుతోందన్నారు. దసరా వేడుకల నిర్వహణకు తమ వేతనాల నుంచి రూ.250 చొప్పున విరాళాలు అందించిన ఉద్యోగులకు, సహకరించిన కార్మిక సంఘాల నాయకులు, అధికారుల సంఘం ప్రతినిధులు, ఫైన్ ఆర్ట్స్ అసోసియేషన్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వో టు జీఎం డి వెంకట రామారావు, ఏజీఎం (పర్సనల్) ఎస్ రమేష్, ఏజెంట్ జి వేణుమాధవ్, ప్రాజెక్టు అధికారులు శ్రీనివాస్ దారి, ఈ శ్రీనివాస్, జి నాగేశ్వరరావు, నాగబాబు, కార్మిక సంఘాల నాయకులు వై. రంగోపాల్, ఎ కృష్ణంరాజు, వి మధన్ నాయక్, డీజీఎం జి శివప్రసాద్, ఏరియా సెక్యూరిటీ అధికారి కె. శ్రీనివాస్, బి శ్యామ్ ప్రసాద్, పి. రామశేఖర్ రావు, నాగెల్లి వెంకటేశ్వర్లు, పి వెంకటరత్నం, ఎన్.డి. నాసర్ పాషా, బి కిషన్, ఆర్ రాంబాబు, సేవ కార్యదర్శి పాకిర, ఇల్లందు లేడీస్ క్లబ్ సభ్యులు, సింగరేణి అధికారులు, కార్మికులు, ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.




# జాతరమ్మ జాతరో... కోటమైసమ్మ జాతరకు జన సందడి

**అమ్మవారిని దర్శించుకున్న ప్రముఖులు**

కారేపల్లి, మహా :కోటమైసమ్మ జాతర జన సందండిగా మారింది. దసరా సందర్భంగా సింగరేణి మండలం ఉసిరికాయలపల్లి కోటమైసమ్మ తల్లి ఆలయ ప్రాంగణంలో మంగళవారం జాతర ఘనంగా ప్రారంభమైంది. ఐదు రోజులు పాటు రాత్రి పగలు నిరంతరాయం సాగే ఈ జాతర కు జనం తరలివస్తున్నారు. రెండోవ రోజు బుధవారం అమ్మవారిని దర్శనానికి జనం క్యూ కట్టారు. ఆలయ వద్ద వాహన పూజకు విశేష ప్రాముఖ్యత ఉండటంతో భక్తులు వాహనలకు పూజ చేయించుకోవటానికి అధికంగా పోటీలు పడ్డారు. వాహన పూజకు భక్తులు అధిక ప్రాధాన్యత ఇస్తుండటంతో దేవదాయశాఖ దానికి అనుగుణంగా ఏర్పాట్లను చేసింది. వాహన పూజకు ప్రత్యేకంగా అర్చకులను నియమించారు. జాతరలో ఏర్పాటు చేసిన వినోద సాధనాలైన టవర్ రైడర్, రేంజర్ రైడర్, రేంజర్, జాయింట్ విల్స్,



కొలంబో, సోలంబో, క్రాస్ వీల్, డ్రాగన్ ట్రైన్ వంటి వాటిలో విహరిస్తూ యువత కేరింతలు కొట్టారు. జాతరలో బూరలలు ఊదుతూ, యువత ఈలల శబ్దంతో జాతర ప్రాంగణం సందండిగా మారింది. పోలీసులు ట్రాఫిక్‌ను నియంత్రస్తూ వాహనాలను పోలంపల్లి క్రాస్ రోడ్‌లోని కోటమైసమ్మ తల్లి ఆర్చి వద్దనే వాహనాలను నిలిపి వేస్తున్నారు. అక్కడి నుండి భక్తులు నడకనే రావాలని కోరుతున్నారు. జాతరలో ఆవాంచనీయ ఘటనలు జరగకుండా 24 గంటలకు ప్రత్యేక పోలీసు బంధోబస్తు నిర్వహిస్తున్నట్లు సింగరేణి సీఐ ఎన్ సాగర్, ఎస్సై బైరు గోపీలు తెలిపారు. జాతరలో అనుమానిత వ్యక్తుల సమాచారంను వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. జాతరలో వైద్యశాఖ ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి భక్తులకు నిరంతరం వైద్య సేవలందిస్తుంది.

**అమ్మవారిని దర్శించుకున్న ప్రముఖులు**

దసరా జాతర సందర్భంగా కోటమైసమ్మ తల్లిని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ దంపతులు దర్శించుకున్నారు. కేరళ అడిషనల్ డీజీపి లక్ష్మన్ నాయక్, సింగరేణి కాలరీస్ ఇల్లందుఏరియా జీఎం వీసం కృష్ణయ్య, ఇల్లందు మాజీ మున్సిపాల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వర్లు లు కుటుంభ సభ్యులతో కలిసి కోటమైసమ్మ ఆమ్మవారిని దర్శించుకున్నారు. వారికి ఆలయ ఆధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం ఫలికారు. ఆలయంలో వారు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ఎలాంటి ఆసౌకర్యం కల్గకుండా ఆలయ చైర్మన్ డాక్టర్ పర్సా పట్టాభి రామారావు, ఈవో కే.వెంకటయ్యలు దగ్గరుండి జాతరను పర్యవేక్షిస్తున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలను ప్రధాన అర్చకులు కొత్తలంక కైలాస శర్మ ఆధ్వర్యంలో వేద పండితులు నిర్వహిస్తున్నారు.



### వర్ష డిసౌజాపై శ్రీదేవి చౌదరి వ్యాఖ్యలు.. 'ది

# ట్రెయిటర్స్ తెలుగు'లో కొత్త వివాదం!

బుల్లితెర, ఓటీటీ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న రియాలిటీ షో 'ది ట్రెయిటర్స్ తెలుగు'లో రోజురోజుకూ ఆసక్తికర పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. హోస్ట్‌గా తేజ సజ్జా వ్యవహరిస్తున్న ఈ షోలో ఇప్పటివరకు గేమ్ వ్యూహాలు, అనుమానాలు, కంటెస్టెంట్ల మధ్య పోటీ ప్రధానంగా కనిపించగా.. తాజాగా ఓ చిన్న హెయిర్ క్లిప్ వ్యవహారం చర్చనీయాంశంగా మారింది. కంటెస్టెంట్ శ్రీదేవి చౌదరి, మరో కంటెస్టెంట్ వర్ష డిసౌజా వస్తువుపై చేసిన వ్యాఖ్యలు వివాదానికి దారితీశాయి. ప్యాలెస్‌లో బ్రేక్‌ఫాస్ట్ సమయంలో రాహత్ అచంట దగ్గర ఉన్న ఓ హెయిర్ క్లిప్‌ను చూసిన శ్రీదేవి.. అది ఎవరిదని ప్రశ్నించారు. వర్ష డిసౌజా తన దగ్గర ఉంచమని ఇచ్చిందని రాహత్ చెప్పడంతో ఆమె స్పందించిన తీరు అందరి దృష్టిని ఆకర్షించింది. ఆ క్లిప్‌ను 'చీప్'గా ఉందని, 'మిడిల్ క్లాస్' వస్తువులా కనిపిస్తోందని శ్రీదేవి వ్యాఖ్యానించినట్లు ప్రచారంలో ఉన్న వీడియోలో కనిపించింది. అంతే కాకుండా ఆ క్లిప్‌ను వెంటనే వర్షకు తిరిగి ఇచ్చేయాలని రాహత్‌కు సూచించారు. సాధారణ సంభాషణగా మొదలైన ఈ వ్యవహారం కాస్తా అసౌకర్యకరమైన పరిస్థితికి దారితీసింది. ఈ వ్యాఖ్యలు షోలో ఎలాంటి పరిణామాలకు దారి తీస్తాయన్న ఆసక్తి ప్రేక్షకుల్లో నెలకొంది. మరోవైపు ఈ ఘటనకు సంబంధించిన చర్చ సోషల్ మీడియాలోనూ మొదలైంది. ఈ వివాదంపై వర్ష డిసౌజా ఎలా స్పందిస్తారన్నది ఆసక్తికరంగా మారింది. 'ది ట్రెయిటర్స్ తెలుగు'లో ఇప్పటికే కంటెస్టెంట్ల మధ్య అనుమానాలు, వ్యూహాలు, వ్యక్తిగత అభిప్రాయాలు ఆటను మరింత ఉత్కంఠభరితంగా మారుస్తున్నాయి. ఒకరి మాటలు మరొకరిపై ఎలాంటి ప్రభావం చూపుతాయో, ఈ చిన్న సంఘటన రాబోయే ఎపిసోడ్లలో ఎలాంటి మలుపు తీసుకుంటుందో చూడాలి. ఎస్ఓఎల్ ప్రొడక్షన్ రూపొందించిన ఈ రియాలిటీ షో ప్రస్తుతం అమెజాన్ ప్రైమ్ వీడియోలో ప్రసారమవుతోంది. కొత్త ఎపిసోడ్లు ప్రతి గురువారం మధ్యాహ్నం 12 గంటలకు విడుదలవుతున్నాయి.

# నీలిరంగు సిల్క్ చీరలో రుక్మిణి వసంత్..

సినిమాల్లో తన నటనతోనే కాకుండా, ప్రత్యేకమైన ఫ్యాషన్ ఎంపికలతోనూ ప్రేక్షకుల దృష్టిని ఆకర్షిస్తున్న నటి రుక్మిణి వసంత్ మరోసారి సంప్రదాయ చీరకట్టులో మెరిశారు. నీలిరంగు గండభేరుండ డిజైన్ మైసూర్ సిల్క్ చీరలో ఆమె కనిపించిన ఫొటోలు ఫ్యాషన్ ప్రియులను ఆకట్టుకుంటున్నాయి. ఆధునిక ఫ్యాషన్ పోకడలకు భిన్నంగా సంప్రదాయ వస్త్రధారణకు ప్రాధాన్యమిస్తూ ఆమె కనిపించడం విశేషం. ఈ లుక్‌లో రుక్మిణి నీలిరంగు మైసూర్ సిల్క్ చీరను ఎంచుకోగా, దానికి జతగా బంగారు రంగు బ్లౌజ్ ధరించారు. చీరలోని రంగుల కలయిక, సిల్క్ వస్త్రపు మెరుపు, బంగారు ఆభరణాలు ఆమె రూపానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. నుదుటిపై సంప్రదాయ బొట్టు ధరించి, ఆభరణాలను చీరకు అనుగుణంగా ఎంచుకోవడంతో మొత్తం అలంకరణలో అందమైన సమతుల్యత కనిపిస్తోంది. సాధారణంగా పండుగలు, శుభకార్యాలు, ప్రత్యేక వేడుకల సమయంలో సంప్రదాయ వస్త్రధారణకు ఎక్కువ ప్రాధాన్యం ఉంటుంది. అలాంటి సందర్భాల్లో మైసూర్ సిల్క్ చీరలు ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నాయి. రుక్మిణి ఎంచుకున్న నీలిరంగు చీర కూడా సంప్రదాయానికి, ఆధునిక అభిరుచికి మధ్య చక్కని సమన్వయాన్ని చూపిస్తోంది. ఈ చీరలో ప్రధాన ఆకర్షణ గండభేరుండ డిజైన్. రెండు తలలు కలిగిన పౌరాణిక పక్షి రూపమైన గండభేరుండకు కర్ణాటక చరిత్ర, సాంస్కృతిక సంప్రదాయాలతో ప్రత్యేక అనుబంధం ఉంది. మైసూరు రాజవంశ చిహ్నంగా ప్రసిద్ధి చెందిన ఈ రూపం వస్త్రాలు, ఆభరణాలు, కళాత్మక డిజైన్లలోనూ కనిపిస్తుంది. అందుకే గండభేరుండ నమూనాతో రూపొందించిన చీరలు సంప్రదాయ వైభవాన్ని ఇష్టపడేవారిని ప్రత్యేకంగా ఆకర్షిస్తాయి. రుక్మిణి ధరించిన ఈ చీరను ప్రముఖ డిజైనర్ లతా పుట్టన్న రూపొందించగా, ఆమె స్టైలింగ్‌లో టియా జాన్ భాగమయ్యారు. మైసూరు దసరా వేడుకల సందర్భంగా నగరం నుంచి లభించిన ఆదరణ తనకు ఎంతో ఆనందాన్ని ఇచ్చిందని రుక్మిణి పేర్కొంటూ, ఈ ప్రత్యేక వస్త్రధారణకు సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. రుక్మిణి వసంత్ కన్నడ చిత్ర పరిశ్రమలో నటిగా ప్రయాణం ప్రారంభించి, 'సప్తసాగరదాచే ఎల్లో' చిత్రాల ద్వారా మంచి గుర్తింపు పొందారు. ఆ తర్వాత విభిన్న కథలు, పాత్రలతో తన నటనా ప్రతిభను చాటుకున్నారు. 'అప్పుడో ఇప్పుడో ఎప్పుడో' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు చేరువైన ఆమె, 'కాంతార: చాప్టర్ 1'తో మరింత మంది ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించారు. సినిమాల ఎంపికలో వైవిధ్యాన్ని చూపిస్తున్న రుక్మిణి, ఫ్యాషన్ విషయంలోనూ తనదైన శైలిని ప్రదర్శిస్తున్నారు. ముఖ్యంగా సంప్రదాయ చీరలను ఆధునిక అలంకరణతో ధరించడం ద్వారా ప్రత్యేకమైన లుక్‌ను సృష్టిస్తున్నారు. నీలిరంగు మైసూర్ సిల్క్ చీరలో ఆమె కనిపించిన తీరు అందుకు మరో ఉదాహరణగా నిలుస్తోంది.





# మహాశక్తి ట్రైలర్ విడుదల!

లేడీ సూపర్‌స్టార్ నయనతార ప్రధాన పాత్రలో నటిస్తున్న భారీ పౌరాణిక ఫాంటసీ చిత్రం 'మహాశక్తి' ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచుతోంది. గతంలో ప్రేక్షకులను ఆకట్టుకున్న 'మూకుత్తి అమ్మన్' చిత్రానికి కొనసాగింపుగా ఈ సినిమా తెరకెక్కుతోంది. తెలుగులో 'అమ్మోరు తల్లి'గా ప్రేక్షకులకు చేరువైన మొదటి భాగం మంచి గుర్తింపు తెచ్చుకోగా, ఇప్పుడు రెండో భాగాన్ని మరింత భారీ స్థాయిలో రూపొందించారు. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన ట్రైలర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. ఇందులో నయనతార అమ్మవారి అవతారంలో శక్తివంతంగా కనిపిస్తూ ఆకట్టుకున్నారు. దైవిక శక్తులు, దుష్టశక్తుల మధ్య జరిగే పోరాటం, భారీ సెట్లు, అద్భుతమైన విజువల్ ఎఫెక్ట్స్ ట్రైలర్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. గత చిత్రంలో భక్తి, హాస్యం, సామాజిక అంశాలకు ప్రాధాన్యం ఇవ్వగా.. ఈసారి పౌరాణిక నేపథ్యం, ఉత్కంఠభరితమైన పోరాటాలు, అద్భుతమైన దృశ్యాలకు పెద్దపీట వేసినట్లు తెలుస్తోంది. ట్రైలర్‌లో నయనతార పాత్ర మరింత శక్తివంతంగా కనిపించడంతో అభిమానుల్లో అంచనాలు పెరిగాయి. ఈ చిత్రంలో రెజీనా కసాండ్రా, ఊర్వశి, యోగిబాబు తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. సుందర్ సి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాకు హిప్ హాప్ తమిళ సంగీతం అందిస్తున్నారు. డా. ఇషారి కె. గణేష్ వెల్స్ ఫిల్మ్ ఇంటర్నేషనల్ బ్యానర్‌పై చిత్రాన్ని నిర్మిస్తున్నారు. భారీ నిర్మాణ విలువలతో రూపొందుతున్న 'మహాశక్తి'ని తెలుగు, తమిళం, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. నవంబర్ 6న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానున్నట్లు సమాచారం. నయనతారను మరోసారి అమ్మవారి పాత్రలో చూడాలని ఎదురుచూస్తున్న అభిమానులకు ఈ ట్రైలర్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది.

### హీరోయిన్ కాయదు లోహర్ వాడిన

# వాటర్ బాటిల్ ధర రూ.3 లక్షలా?..

సెలబ్రిటీలకు అభిమానులు ఉండటం సహజం. తమ అభిమాన నటీనటులకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు, వస్తువులను జ్ఞాపకాలుగా భద్రపరుచుకోవాలని చాలామంది కోరుకుంటారు. అయితే కొన్నిసార్లు ఈ అభిమానం వింత పరిణామాలకు దారితీస్తుంటుంది. తాజాగా హీరోయిన్ కాయదు లోహర్‌కు సంబంధించిన ఓ వాటర్ బాటిల్ వ్యవహారం సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారింది. ఆమె ఉపయోగించిన వాటర్ బాటిల్‌ను ఆన్‌లైన్ మార్కెట్ వేదిక ఓఎల్ఎక్స్‌లో ఏకంగా రూ.3 లక్షలకు అమ్మకానికి పెట్టినట్లు ప్రచారం జరుగుతోంది. సాధారణంగా తక్కువ ధరకు లభించే వాటర్ బాటిల్‌కు ఇంత భారీ ధర నిర్ణయించారనే వార్త నెటిజన్లను ఆశ్చర్యానికి గురిచేస్తోంది. అయితే ఈ బాటిల్‌ను ఎవరు అమ్మకానికి పెట్టారు? నిజంగానే అది కాయదు లోహర్ ఉపయోగించిన బాటిలేనా? అనే విషయాలపై స్పష్టత లేదు. ఈ విక్రయ ప్రకటనకు సంబంధించిన అసలు ఆధారాలు కూడా ఇప్పటివరకు బయటపడలేదు. దీంతో ఈ వ్యవహారం నిజమైన అమ్మకపు ప్రయత్నమా? లేక సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ప్రచారమేనా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. కొందరు నెటిజన్లు సెలబ్రిటీల క్రేజ్‌ను ఉపయోగించుకుని సాధారణ వస్తువులకు సైతం లక్షల్లో ధరలు నిర్ణయించడం ఏమిటంటూ వ్యాఖ్యానిస్తున్నారు. మరికొందరు ఈ వార్తపై సరదాగా మీమ్స్ రూపొందిస్తున్నారు. సాధారణ వస్తువుకు ఒక ప్రముఖ నటి పేరు జతచేస్తే దాని విలువ అంతగా పెరిగిపోతుందా అంటూ ప్రశ్నిస్తున్నారు. కాయదు లోహర్ సినిమాల విషయానికొస్తే, తమిళ చిత్రం 'డ్రాగన్'తో ఆమెకు మంచి గుర్తింపు లభించింది. ఆ తర్వాత తెలుగు సినిమాల్లోనూ నటిస్తూ ప్రేక్షకులకు చేరువయ్యారు. 'అల్లూరి', 'ఫంకీ', 'ది ప్యారడైజ్' వంటి చిత్రాలతో తెలుగు ప్రేక్షకుల్లో గుర్తింపు సంపాదించుకున్నారు. ప్రస్తుతం ఆమెకు సంబంధించిన వాటర్ బాటిల్ వార్త సోషల్ మీడియాలో చర్చకు దారితీస్తోంది. అయితే బాటిల్ నిజంగా అమ్మకానికి పెట్టారా? రూ.3 లక్షల ధర నిర్ణయించారా? అనే విషయాలు అధికారికంగా నిర్ధారణ కాలేదు. కాబట్టి ఈ ప్రచారాన్ని నిర్ధారిత వార్తగా భావించకుండా, పూర్తి వివరాలు వెలుగులోకి వచ్చే వరకు వేచి చూడాల్సిందే.






# డీఎస్పీపై మైత్రీ రవి కీలక వ్యాఖ్యలు!

మెగా పవర్‌స్టార్ రామ్‌చరణ్, క్రియేటివ్ డైరెక్టర్ సుకుమార్ కాంబినేషన్‌లో తెరకెక్కనున్న ఆర్సీ 17 సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. 'రంగస్థలం' వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత వీరిద్దరూ మరోసారి కలిసి పనిచేయనుండటంతో ఈ ప్రాజెక్ట్‌పై అభిమానుల్లో ఆసక్తి పెరిగింది. అయితే ఈ సినిమాకు సంగీత దర్శకుడు ఎవరనే అంశం ప్రస్తుతం టాలీవుడ్‌లో చర్చనీయాంశంగా మారింది. ఇప్పటివరకు సుకుమార్ సినిమాలకు సంగీతం అందిస్తూ వచ్చిన దేవిశ్రీ ప్రసాద్ ఈ ప్రాజెక్ట్‌లో కొనసాగుతారా? లేక కొత్త సంగీత దర్శకుడికి అవకాశం ఇస్తారా? అనే ప్రశ్నలకు నిర్మాత మైత్రీ రవి శంకర్ తాజాగా స్పందించారు. ఆర్సీ 17 సంగీత దర్శకుడి ఎంపికపై తుది నిర్ణయం దర్శకుడు సుకుమార్‌దేనని ఆయన స్పష్టం చేశారు. సుకుమార్ ప్రస్తుతం లండన్‌లో ఉన్నారని, ఆయన తిరిగి వచ్చిన తర్వాత ఈ విషయంపై నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. సినిమా కథ, స్క్రిప్ట్ పనులపై ప్రస్తుతం చర్చలు జరుగుతున్నాయని, ఇతర నటీనటులు, సాంకేతిక బృందం ఎంపికపై ఇంకా తుది నిర్ణయాలు తీసుకోవాల్సి ఉందని పేర్కొన్నారు. దేవిశ్రీ ప్రసాద్‌తో తమ నిర్మాణ సంస్థకు మంచి అనుబంధం ఉందని మైత్రి రవి తెలిపారు. ఆయన తమ బ్యానర్‌లో ఏడు సినిమాలకు పనిచేశారని, ఆ చిత్రాలన్నీ మంచి విజయాలను అందుకోవడంతో పాటు సంగీతపరంగానూ ప్రేక్షకులను ఆకట్టుకున్నాయని గుర్తుచేశారు. ఒకవేళ ఆర్సీ 17కు మరో సంగీత దర్శకుడిని ఎంపిక చేసినా, దాని అర్థం దేవిశ్రీ ప్రసాద్ ప్రతిభను తక్కువగా చూడటం కాదని స్పష్టం చేశారు. దేవిశ్రీ ప్రసాద్‌కు ఇంకా ఎంతో సుదీర్ఘమైన కెరీర్ ఉందని, ఒక్క సినిమా ఎంపికతో ఆయన ప్రతిభను అంచనా వేయలేమని పేర్కొన్నారు. మరోవైపు, ఆర్సీ 17 కోసం అనిరుధ్ రవిచందర్, శాశ్వత్ సచ్‌దేవ్ వంటి సంగీత దర్శకుల పేర్లు పరిశీలనలో ఉన్నాయంటూ గత కొంతకాలంగా ప్రచారం జరుగుతోంది. అయితే వీరిలో ఎవరినైనా అధికారికంగా ఎంపిక చేసినట్లు చిత్రబృందం ప్రకటించలేదు. 'ఆర్య' నుంచి 'రంగస్థలం', 'పుష్ప' చిత్రాల వరకు సుకుమార్‌దేవిశ్రీ ప్రసాద్ కలయికలో ఎన్నో విజయవంతమైన పాటలు వచ్చాయి. దీంతో ఈ ఇద్దరి కాంబినేషన్ కొనసాగుతుందా? కొత్త సంగీత దర్శకుడికి అవకాశం దక్కుతుందా? అన్నది ఆసక్తికరంగా మారింది. ప్రస్తుతం ఈ అంశంపై వస్తున్న ప్రచారానికి తెరపడాలంటే సుకుమార్ తుది నిర్ణయం వెలువడాల్సిందే.

EDITOR, PRINTER,PUBLISHER AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, PRINTED AT 19-12-458, BAIRAGIPATTEDA, TIRUPATHI - 517501, A.P., REGD NO : APTEL/2014/58382. PH NO : 6300992296, Email : mahapathrika2003@gmail.com. PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. Corporate Office : 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana, IN - 500034